తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# పకడ్బందీగా టెన్త్ పరీక్షల నిర్వహణ

**- కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు**
**- అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్రపాడెల్, విద్యాశాఖ అర్జెడీ శామ్యూల్‌లు**



చిత్తూరు, మార్చి 6 ప్రభాతవార్త: జిల్లాలో మార్చి 16వ తేదీ నుండి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించి పూర్తి చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్రపాడెల్, విద్యాశాఖ అర్జెడీ శామ్యూల్‌లు పేర్కొన్నారు. జడ్పీ సమావేశభవనంలో శుక్రవారం అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్రపాడెల్, విద్యాశాఖ అర్జెడీ శామ్యూల్‌లు టెన్త్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల హెడ్మాస్టర్లు, డిప్యుటీ తహసిల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్రపాడెల్, విద్యాశాఖ అర్జెడీ శామ్యూల్‌లు మాట్లాడుతూ ప్రశ్నాపత్రాలను పరీక్షా కేంద్రాలకు చేరవేయడం, విద్యార్థులు రాసిన అన్సర్ షీట్లను స్ట్రాంగ్ రూమ్‌లకు చేరవేయడంలో పక్కాగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితో పోలీసు శాఖ జోక్యం చేసుకొని తగు చర్యలు తీసుకోవాలన్నారు. టెన్త్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి చిన్న తప్పులను సైతం సహించమని, కాపీయింగ్ జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. టెన్త్ పరీక్షలు విద్యార్థి జీవితంలో కీలకపాత్ర పోషిస్తాయని, వీటిని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ టెన్త్ పరీక్షలను పక్కాగా నిర్వహించడానికి జిల్లా వ్యాప్తంగా 129 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పరీక్షలకు 23,095 మంది విద్యార్థులు హాజరు కానున్నారని ఇందులో 12,105 మంది బాలురు, 10,990 మంది బాలికలు వున్నారన్నారు. ఈ సమావేశంలో డిప్యుటీ డివైఇఓలు, ఎంఇఓలు, హెడ్మాస్టర్లు, డిప్యుటీ తహసిల్దార్లు తదితరులు హాజరయ్యారు.

### ధైర్యం, నిబద్ధత, క్రమశిక్షణతో...
# మహిళలు సమర్ధవంత విధులు

**-పోలీస్‌శాఖలో మహిళా సిబ్బంది సేవలు**



తిరుపతి,మార్చి 6ప్రభాతవార్త: పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా సిబ్బంది తమ ధైర్యం, నిబద్ధత, క్రమశిక్షణతో సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బ రాయుడు అభినందించారు. మహిళల్లో విశ్వాసాన్ని కల్పించడం ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యత అని అన్నారు. మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళలకు ప్రత్యేక వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది మహిళల భద్రత సాధికారతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా మహిళలు నేటి సమాజంలో ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, నేరాలపై అప్రమత్తంగా ఉండే విధంగా చైతన్యం కల్పిస్తున్నారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, మహిళా ప్రాంగణాలు, వాణిజ్య సముదాయాలు తదితర ప్రాంతాలను సందర్శించిన మహిళా పోలీసులు, పోలీసు అధికారులు మహిళలకు భద్రతకు సంబంధించిన అంశాలపై జాగ్రత్తలు వివరిస్తున్నారు. జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఇక్కడికి విచ్చేసిన డాక్టర్లు,మా పోలీస్ కుటుంబ సభ్యులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నా అన్నారు. ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ సతీమణి ఎల్. శ్రీఇందు హారిక,ఆధనపు ఎస్పీ సతీమణి కీర్తి,అదనపు ఎప్పీ విమలాకుమారి ,అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరచారి, శ్రీనివాసులు, మహిళ డిఎస్పీ శ్రీలత, పోలీస్ డాక్టర్ మాధురి, సీఐడీ డీఎస్పీ పద్మలత,మహిళా సీఐ తమీమ్ అహ్మద్ పాల్గొన్నారు.

### అపరిశుభ్రతకు నిలయాలు...
# సాంఘిక సంక్షేమశాఖ గురుకులాలు!

**-లోపించిన పారిశుధ్యం, నాణ్యతలేని భోజనం**
**-అధికారులు చర్యలు తీసుకోవాలంటున్న తల్లిదండ్రులు**

ఓబులవారిపల్లి, మార్చి 6 ప్రభాతవార్త : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలకు కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేసి ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ గురుకులాలకు సంబంధించి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాల్సి వుంది. భావితరాలకు ఆదర్శంగా, విద్యార్థులు భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగాలని కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, వాటిని విస్మరించి ఓబులవారిపల్లి మండలంలో ఉన్న సంజీవపురం సాంఘిక సంక్షేమశాఖ గురుకులంలో విద్యార్థుల ప్రవర్తనలో మార్పులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడ పాఠశాలలో స్నానపు గదులు, మరుగుదొడ్లు ఆపశుభ్రతకు నిలయాలుగా మారాయి. అంతేకాకుండా మెరుగైన భోజన వసతి లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలలో గ్రూపు రాజకీయాలు ఎక్కువగా ఉన్నాయని విమర్శలకు తావిస్తున్నాయి. అంతేకాకుండా ఇటీవల కాలంలో పదవ తరగతి విద్యార్థులు మరియు ఇంటర్మీడియట్ విద్యార్థులు చిన్నచిన్న విషయానికి గొడవపడి రెండు మూడు దపాలుగా, ఒకరిపై మరొకరు దాడులు చేసుకున్నట్లు సమాచారం. ఏది ఏమైనా అక్కడ పర్యవేక్షించాల్సిన అధికారులు విఫలమైనట్లు తెలుస్తుంది. ఇలా గొడవలు జరిగినప్పుడు గట్టి చర్యలు తీసుకుని, విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి గట్టిగా కౌన్సిలింగ్ ఇచ్చి మందలించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వున్నారని ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా విద్యార్థుల దశమించే క్రమశిక్షణ చర్యలకు ఎటువంటి భంగం కలవకుండా గట్టి చర్యలు తీసుకోవాలని అటు విద్యార్థులు సంఘాలు పెద్దలు విద్యావేత్తలు సూచిస్తున్నారు. ఆడపూరు మరియు బీసీ గురుకులాలు ఎస్టీ గురుకులాల్లో కూడా ఇలాంటి సమస్యల తలెత్తుతున్నాయని అంటున్నారు. అలాగే వారికి మెరుగైన భోజన వసతి గదులలో ఫ్యాన్లు మరియు మరుగుదొడ్లు అపశుభ్రత లేకుండా తాగునీటి సౌకర్యం కూడా కల్పించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ ఈ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.





ఓబులవారిపల్లి మండలంలో ఉన్న సంజీవపురం సాంఘిక సంక్షేమశాఖ గురుకులం

### గ్రంథాలయాలను...
# దేవాలయాలుగా తీర్చిదిద్దుతా!

**- పుస్తక పఠనంతో మానసిక ఉల్లాసం**
**- గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి వారి గురవారెడ్డి**



ఉమ్మడి జిల్లాలో బిడిసి నిర్వాహకులతో సమీక్షలో గ్రంథాలయ చైర్మన్

తిరుపతి హెల్త్, మార్చి 6 ప్రభాతవార్త: గ్రంథాలయాలను దేవాలయాలుగా తీర్చిదిద్దుతానని గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతి గ్రేడ్‌వన్‌శాఖ గ్రంథాలయంలో చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అధ్యక్షతన ఉమ్మడి జిల్లాలో ఉన్నటువంటి గ్రంథాలయ ఉద్యోగులు బిడిసి నిర్వాహకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో చైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి మాట్లాడుతూ పుస్తక పఠనం వైపు విద్యార్థులు పాఠకులకు మానసిక ఉల్లాసంగా ఉండే విధంగా తీర్చిదిద్దే ఆలోచనతో పని చేద్దాం అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేష్ సారధ్యంలో కూటమి ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధి చాలా లక్ష్యంతో పని చేస్తుందన్నారు. దానికి నిదర్శనమే ఇటీవల విద్య మంత్రి నారా లోకేష్ అసెంబ్లీలో మాట్లాడుతూ గ్రంథాలయాలలో పిల్లల పుస్తక పఠనం వైపు మొగ్గు చూపాలని దానికి ఒక ఉదాహరణగా తన కుమారుడు దేవాన్ష్ ప్రతిరోజు ఒక పుస్తకం ఒక రోజులో చదువుగలరని చెప్పారు. మరి గ్రంథాలయాల పట్ల వారికి ఉన్నటువంటి చిత్తశుద్ధికి అది నిదర్శనం అన్నారు. ఆ విధంగా గ్రంథాలయ సిబ్బంది పాఠకులు పెంపునకు కృషి చేయాలని అలాగే జిల్లాలో 71 గ్రంథాలయాల ద్వారా ఒక రోజుకు సుమారు 4000 మంది పాఠకలు వస్తున్నారు. ఈ సంఖ్యను ప్రత్యేక చొరవతో మీరు పెంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సెస్ వసూళ్ల పై ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరపాలక సంస్థ ద్వారా 22 కోట్ల 35 లక్షలు చిత్తూరు మున్సిపాలిటీ ద్వారా ఐదు కోట్ల 39 లక్షలు శ్రీకాళహస్తి నగరపాలక సంస్థ ద్వారా ఒక కోటి 77 లక్షలు ఇలా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరపాలక సంస్థలు మరియు మున్సిపాలిటీలు నుండి దాదాపు 33 కోట్ల 87 లక్షల రూపాయలు ఉన్నాయని వీటిని గ్రంథాలయ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అధికారులను కలిసి వసూళ్లకు కృషి చేయాలని అలాగే చైర్మన్‌గా ఉన్న తాము కూడా సంబంధ అధికారులను కలిసి చెస్ వసూళ్లకు కృషి చేస్తానని, ఈ సందర్భంగా దిశా నిర్దేశం చేశారు. గ్రంథాలయాల అభివృద్ధి జరగాలన్న మీకు అంతా జీతభత్యాలు రావాలన్నా ఏ కార్యక్రమం చేయాలన్నా మన ముందున్న ఏకైక లక్ష్యం చెస్ వసూళ్ల అనే విషయాన్ని మీరు గ్రహించాలని కోరారు. అలాగే ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంధాలయాలు 71 కాగా వాటిలో ఎక్కువ భాగం ఆధునిక యుగములో సంబంధించిన డిజిటల్ లైబ్రరీలు మార్చే విధంగా కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్, కృషి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం,చుట్టుపక్కల ఉన్న పరిశ్రమల యజమానులతో సంప్రదించి వారి సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా డిజిటల్ లైబ్రరీ తీసుకువచ్చే విధంగా కృషి చేస్తామన్నారు అందులో సిబ్బంది రెగ్యులర్ సిబ్బంది 34 మంది ఔట్సోర్సింగ్ సిబ్బంది 14 మంది ఉన్నారు. ఈ సిబ్బంది కొరతను కూడా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి దృష్టికి మరియు రాష్ట్ర మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే ఆలోచనలో ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి, గ్రంథాలయ కార్యదర్శి ఆర్‌వితార్‌ఎస్ఎస్ శర్మ గరు, జిల్లాలోని గ్రంథాలయ అధికారులు అలాగే బీడీసీ నిర్వాహకులు, కార్యాలయ సిబ్బంది సుమారు 150 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

# కళా విహీనంగా...ఎన్టీఆర్ పార్కు

**-ఉన్న ఒక్క పార్కు కళ తప్పింది**
**-అంతరించి పోతున్న పూల మొక్కలు , ఆటవస్తువులు**
**-వ్యాపారాలకు తెర తీసిన మున్సిపాలిటి**

శ్రీకాళహస్తి,మార్చి 6 ప్రభాత వార్త: శ్రీకాళహస్తి ప్రజలకు ఉన్న ఒకే ఒక్క అవకాశం ఆహ్లాదానికి ఎన్‌టిఆర్ పార్కు పట్టణంలోని పానగల్‌లో ఉంది. ఇక్కడ ఐదెక రాల స్థలాన్ని నాడు పరిపాలించిన పవార్ వంశస్థులు కొనుగోలు చేసి మున్సిపల్ ఆస్తిగా భద్రపరచారు. అయితే బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాంలో పట్టణ ప్రజలకు ఆహ్లాదానికి ఓ మంచి పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఏర్పాటు చేసారు. దాని పర్యవేక్షణ మున్సిపల్ అధికారులు, తుడ అధికారులు గాలికి వదలిపెట్టారు. మరిన్ని మొక్కలు పెంచడం లేకపోగా, వున్న మొక్కలు ఎండి పోయాయి. అదే విధంగా చిన్న పిల్లల ఆట స్థలంలో మర్ని ఆట వస్తువులు అమర్చాలిన అవసరం వుంది. ఇక్కడ వ్యాపార కేంద్రాలకు తెర తీసి, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ వారు పార్కు ముందు దుకాణాలకు, తమ కార్యకర్తలకు అందిస్తున్నారు. గత పాలకులు ఒకరికి కేటాయిస్తే ప్రస్తుత పాలకులు మేమేమీ తీసిపోయామా? అని మరొకరికి అవకాశం కల్పించారు. ఇక పార్కు లోపల పిల్లల ఆట వస్తువులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. చిన్న పిల్లలకు ఏర్పాటు చేసిన ఆట వస్తువులు పాడైపోతున్నా, అదనపు ఆట వస్తులను ఏర్పాటు చేయడలేదు.
శ్రీకాళహస్తి పట్టణంలో పూర్వం పరిపాలించిన పాలకులు నాటి పట్టణ ప్రజలకు అవసరమైన చోట పార్కులు ఏర్పాటు చేసారు. జయరామారావు పార్కు, రామచంద్రారావు పార్కు ఇలా ఏర్పాటు చేసారు. అయితే కాలం మారుతున్న కొద్ది ఆ పార్కులను కాలగర్భంలో కలిపివేసారు. పట్టణ ప్రజల ఆహ్లాదానికి సంబంధించి చక్కటి పార్కులేదు. బీడు భూముల అభివృద్ధి పథకంలో గోపాలకృష్ణారెడ్డి రూ.5కోట్లు నిధులు సాధించి లోబావిలో పార్కు ఏర్పాటు చేసి, నిర్వహణను దేవస్థానంకు అప్పగించారు. ఇది మూనాళ్ళ ముచ్చటగా మారి, అక్కడ గడ్డికూడా ఎండిపోయింది. 2014లో ఉన్న కౌన్సిల్ చైర్మెన్ పేట రాధారెడ్డి హాయంలో పానగల్‌లోని ఐదెకరాల స్థలంలో పార్కును ఏర్పాటు చేసారు. ఇక్కడ చిన్నపిల్లల ఆహ్లాదానికి ఆడుకోవటానికి పలు అంశాలను ఏర్పాటు చేయుటకు టెండర్ పిలిచారు. నేడు తిరుపతి జిల్లా పార్టీ పగ్గాలను నిర్వహిస్తున్న నాయకుని పిఏ దానికి దక్కించుకున్నారు. ఇక్కడ ఆట వస్తువుల్లో ప్రవేశానికి రూ.50లు పీజులు చెల్లించాలి. అలాజంపింగ్,బోటింగ్, రైలు లాంటి చిన్నపిల్లల వినోదాలను ఏర్పాటు చేసారు. ఇక పార్కు ముందు దుకాణాలకు గత పాలకులు తెర తీసారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కూడా పార్టీ స్వామి భక్తి కల్గిన ఓ యువకునికి మరో దుకాణం కేటాయించారు. పార్కు ముందు అసలే పార్కింగ్ సమస్య, రాజకీయ పార్టీలు తమ అనుయాయులకు ఉపాధి కోసం దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు.





**మూతపడ్డ ఇ-మరుగుదొడ్లు:**
ఎన్‌టిర్ పార్కు నిర్వహాణకు మున్సిపాలిటి 6 మంది సిబ్బందిని నియమించింది. దీని నిర్వహణ ఇంజనీరింగ్‌శాఖ పర్యవేక్షిస్తుంది. ఇక ఇ-మరుగుదొడ్లు మూతపడ్డాయనే విషయం అయినా ఇంజనీరింగ్ అధికారులకు ఎవరుకయో లేదో తెలియదు. ఇక వాకింగ్ ట్రాక్‌లు, జిమ్‌లు బాగున్నా ఇక్కడ పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ అధికారులు కన్నెతి చూడరు. దాంతో లక్షలు వెచ్చించిన పార్కు దీనావస్థకు చేరుకుంది. పార్కును శిథిలం కాక ముందే దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

### వేసవిలో...
# భక్తులకు మెరుగైన సౌకర్యాలు



అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి

తిరుమల,మార్చి 6ప్రభాతవార్తప్రతినిధి: వేసవికాలం మొదలైందని, రానున్న వేసవి సెలవులు దృష్టిలో ఉంచుకుని భక్తులకు సౌకర్యాలు కల్పించడంపై చొరవచూపాలని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సూచించారు. అన్నప్రసాదం, మంచినీటి పంపిణీ, నడక దారి భక్తులకు మార్గమధ్యలో షెడ్ల ఏర్పాటు, మాడ వీధులు తదితర ప్రాంతాల్లో కూల్ పెయింటింగ్ వేయాలని నిర్ణయించారు. అలాగే మజ్జిగ పంపిణీ పాయింట్ల సంఖ్యను పెంచి వేసవిలో భక్తుల దాహార్తిని తీర్చేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వసతి సదుపాయాలు, అన్నప్రసాదం నిర్వహణను మరింత సమర్థంగా అమలు చేయనున్నారు. నడకదారి భక్తులు, అధిక రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. వేసవిలో కంపార్ట్ మెంట్లు, క్యూలైన్లల్లో సామాన్య భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గించడం, వారికి వీలైనంత త్వరగా దర్శనం కలిగేలా చర్యలు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి సారించారు. టీటీడీ అధికారులు. ఈసారి ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా టెక్నాలజీ వినియోగాన్ని మరింత పెంచి, కంపార్ట్ మెంట్లల్లో రద్దీ, గంటల వారీగా ఇన్ అవుట్ ఫ్లో, వేచి ఉండే సమయాన్ని ప్రతి నిమిషం పర్యవేక్షి స్తూ అవసరమైన చోట తక్షణ నిర్ణయాలు తీసుకోనున్నారు. గత వేసవిలో జూన్ లో సగటున రోజుకు 80 వేల నుంచి 82 వేల మందికి దర్శనం కల్పించారు. సమర్థవంతమైన టైమ్ మేనేజ్‌మెంట్, అన్ని విభాగాల సమన్వ యంతో సాధ్యమైందని భావిస్తున్నారు. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో భక్తులకు మెరుగైన సౌకర్యాలతో దర్శన భాగ్యాన్ని కల్పించడానికి చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవిలో భక్తులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా టిటిడిలోని అన్ని విభాగాలు సమన్వయంతో కార్యరంగంలోకి దిగేలా అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి

# కొలిక్కిరాని పులికాట్ సరిహద్దు వివాదం



జాలరర్ల సమస్యను పరిష్కానికి విచ్చేసి అధికారులు

తడ,మార్చి 6 ప్రభాతవార్త: పులికాట్ సరస్సులో ఆంధ్ర తమిళనాడు సరిహద్దు వివాదం ఎన్నో ఏళ్లగా నెలకొని ఉంది ఆంధ్ర ప్రభుత్వ అధికారులు జాలర్ల పులికాట్ సరస్సులో ఆంధ్ర సరిహద్దులు ఏర్పాటు చేసి హద్దులు నాటినప్పటికీ తమిళనాడు జాలర్లు ఆంధ్ర సరిహద్దుల్లోకి వచ్చి చేపలు వేట చేపట్టడంతో వివాదం ఎప్పటి నుండో నెలకొని ఉంది. ఈ సమస్యపై ఆంధ్ర మత్స్యకారులు అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటి రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన్ శ్రీధర్ ఈ సమస్యను రాష్ట్ర మంత్రి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో సమస్యను పరిష్కరించడానికి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అధికారులురంగంలోకి దిగారు. సూళ్లూరుపేట ఆర్డీవో దేవేందర్‌రెడ్డి, నాయుడుపేట డిఎస్పి చెంచుబాబు, సూళ్లూరుపేట సిఐ మురళీకృష్ణ, తడ ఎస్ఐ కొండప్ప నాయుడు, తడ తహసిల్దార్, అటవీశాఖ రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన్ శ్రీధర్ అందరూ కలిసి తమిళనాడు ఏడి ఫిషరీస్ గుమ్మిడిపూడి తహసిల్దార్, పోలీస్ శాఖతో గుమ్మిడిపూడి ఎమ్మార్వో కార్యాలయం నందు శుక్రవారం చర్చలు జరిపేందుకు వెళ్లారు. చర్చ కొలిక్కి రాకపోవడంతో, చర్చలు అనంతరం పులికాట్ సరస్సు ఆంధ్ర తమిళనాడు సరిహద్దు వద్ద చర్చలు జరిపేందుకు ఆంధ్ర ప్రభుత్వ అధికారులు తమిళనాడు ప్రభుత్వ అధికారులతో పాటు రెండు రాష్ట్రాలు సంబంధించి ఇద్దరిద్దరు చొప్పున మత్స్యకారులు సరిహద్దు వద్ద చర్చలు జరిపేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. పులికాట్ సరిహద్దు ప్రాంతానికి ఒప్పందం ప్రకారం ఆంధ్ర ప్రభుత్వ అధికారులతో పాటు ఇద్దరు మత్స్యకారులు చేరుకున్నారు. కానీ తమిళనాడు అధికారులతో పాటు పెద్ద సంఖ్యలో మత్స్యకారులు సరిహద్దు ప్రాంతానికి చేరడంతో వివాదం చెలరేగింది. ఆంధ్ర మత్స్యకారులపై, తమిళనాడు మత్స్యకారులు వివాదానికి దిగడంతో అక్కడ నుండి ఆంధ్ర ప్రభుత్వ అధికారులు, మత్స్యకారులు వెను తిరిగారు. సరిహద్దు సమస్యలు జిల్లా కలెక్టర్ ఎస్పీ దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు.

# పోలీసులను చూసి వెంకట్రావు పరార్

**-పోలీసుల అదుపులో భార్య చంద్రకళ**



పలమనేరు పోలీస్‌స్టేషన్‌లో చంద్రకళ

పలమనేరు, మార్చి 6 ప్రభాతవార్త: పలమనేరులో ఐపి వేసిన వెంకట్రావు పోలీసులను చూసి పరారీ అయ్యాడు. దీంతో అతని భార్య చంద్రకళను పోలీసులు గురువారం రాత్రి బెంగళూరులో అదుపులోకి తీసుకున్నారు. వారం రోజుల క్రితం పలమనేరుకు చెందిన చీటీల వ్యాపారి వెంకట్రావు రూ.13.14 కోట్లకు ఐపి వేసి 71 మందికి లాయర్ నోటీసులు పంపిన విషయం తెల్సిందే. రాత్రికి రాత్రే ఇల్లు మూసి తాళాలు వేసి భార్యతో పరారీ అయ్యాడు. దీంతో విషయం తెలుసుకున్న బాధితులు లబోదబో మంటూ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా కొందరు బాధితులు బెంగళూరులో తమకు తెలిసిన వారి ద్వారా ఆరా తీయగా వెంకట్రావు ఆచూకీ లభించింది. వెంటనే బాధితులు పోలీసులను తీసుకొని బెంగళూరు వెళ్ళారు. ఐతే పోలీసులు వచ్చారని తెలుసుకున్న వెంకట్రావు దొడ్డిదారిన పరారీ అలయ్యాడు. దీంతో పోలీసులు చంద్రకళను పలమనేరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకు వచ్చారు. పోలీసులు విచారించగా తనభర్త ఎక్కడ ఉన్నాడో తనకు తెలియదని సమాధానమిచ్చింది. విషయం తెలుసుకున్న మిగిలిన బాధితులు కూడా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తమకు న్యాయం చేయాలని పోలీసులకు విన్నవించారు. చంద్రకళ మాట్లాడుతూ ఒకవైపు చీటీలు వేసిన వారి వేధింపులు తట్టుకోలేక మరో వైపు చీటీలు తీసిన వారు సక్రమంగా చెల్లించక పోవడం వల్లనే తాము ఐపి వేసినట్లు అంగీకరించింది. ఐతే తనభర్త తనను ఇక్కడ వదలి ఎక్కడ వెళ్ళాడో తెలియదని చెప్పింది. ఎస్ఐ లోకేష్‌రెడ్డి మాట్లాడుతూ చీటీలు ఎత్తి తిరిగి కట్టని వారిని కూడా పిలిపించి విచారిస్తామని బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# స్వర్ణరథంపై విహరించిన విఘ్ననాధుడు

కాణిపాకం, మార్చి 6 ప్రభాతవార్త: కాణిపాకం వరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో శుక్రవారం రాత్రి సిద్ది బుద్ది సమేతుడైన గణనాధుడు సర్వాలంకృతుడై స్వర్ణరథంపై అధిరోహించి ఆలయ మాడా వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ప్రతి నెలా పౌర్ణమి అనంతరం సంకటహార చతుర్థి రోజున రాత్రి స్వామివారికి స్వర్ణరథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు దేవస్థానం ఆస్థాన మండపంలో ఉదయం 9, 11 గంటలకు, సాయంత్రం 5 గంటలకు సంకటహార చతుర్థి వ్రతంను మూడు ధఫాలుగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి స్వర్ణ రథోత్సవంను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిద్ది, బుద్ది సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి సర్వాంగ సుందర ంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాల నడుమ మిరమిట్లు గొలిపే రీతిలో అలంకరించిన స్వర్ణరథంపై వుంచి మరోమారు అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గణేష్ నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ మాడా





వీధుల్లో స్వామి, అమ్మవార్లను ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఈఓ కె.పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, రవి, అర్చకులు,వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## తిరుపతిలో ఏప్రిల్ 19న బిసీ సదస్సు

– జాతీయ బిసీ సంక్షేమ ప్రధాన కార్యదర్శి పి.షణ్ముగం



**చిత్తూరు, మార్చి 6 ప్రభాతవార్త:** బిసీల హక్కుల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి సాధించుకోవడానికి తిరుపతిలో ఏప్రిల్ 19న రాజకీయ పార్టీలకు అతీతంగా బిసీ సదస్సు ఏర్పాటు చేసినట్లు జాతీయ బిసీ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి, మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ పి.షణ్ముగం అన్నారు. చిత్తూరు బిసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయ స్థాయిలో కేంద్ర మంత్రిమండలి నిర్ణయం మేరకు జనాభా గణన లెక్కల్లో బిసీ జనాభా లెక్కలు తేల్చాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నామన్నారు. అలాగే బిసీలకు కేంద్ర మంత్రి వర్గంలో ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలని, అలాగే బిసీలకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించి రాజ్యాధికారంలో భాగస్వాములను చేయాలని, మండల కమిషన్ సిఫార్సులను మొత్తం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో బిసి సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు రవీంద్రరాజు వడ్డెర, మేదర సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, ముదిరాజ్ సంఘ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్‌బాబు, వడ్డెర సంఘ మహిళా అధ్యక్షురాలు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతీ నమోస్తుభ్యం వరదే కామరూపిణీ!



**బోయకొండ(చౌడేపల్లి), మార్చి 6 ప్రభాతవార్త:** సరస్వతీ నమోస్తుభ్యం...అంటూ విద్యార్థులు అమ్మ వారి చెంత మోకరిల్లి ప్రణామం చేసారు. శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ సన్నిధానంలోని ప్రాంగణంలో విద్యార్థుల సమక్షం నందు సామూహిక సరస్వతీ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయశాఖ వారి ఆధ్వర్యంలో జరిగిన పూజలో విద్యార్థులకు ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం విద్యా కర వస్తువులందించారు. చదువును కష్టంతోకాకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలధిరోహించాలన్నారు. వేద పండితుడు గోవర్ధనశర్మ, జన్నే సుబ్రమణ్యం నాయుడు, ఆలయ ఆధికార, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల పట్ల ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలి



**చౌడేపల్లి, మార్చి 6 ప్రభాతవార్త:** ప్రభుత్వ బిసీ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థుల పట్ల ప్రభుత్వ వైఖరిని మార్చుకోవాలని ఓబీసీ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌యాదవ్ అన్నారు. విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద ఈనెల 9న ఓబీసీ విద్యార్థుల సమస్యల సాధన కోసం నిరాహారదీక్ష నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని బీసీ సోదరులు, విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చివరి ప్రయత్నంగా చేస్తున్న నిరాహారదీక్షా కార్యక్రమానికి బీసీలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## గంగమ్మకు వేలం పాటల ద్వారా రూ. 24.21లక్షల ఆదాయం



**బోయకొండ(చౌడేపల్లి), మార్చి 6 ప్రభాతవార్త:** శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయంలో 2వ రోజున వివిధ వనరులకు నిర్వహించిన వేలం పాటలో రూ. 24,21,000లు ఆదాయంగా సమకూరినట్లు ఇఓ, ఉప కమీషనర్ ఏకాంబరం తెలిపారు. కొండపై కార్యాలయంలో సంవత్సర కాలం పాటు జరిగిన వేలం పాటలో కొళ్ళను విక్రయించుకొనే హక్కును పవన్ రూ. 7లక్షలు హెచ్చుగా పాడి దక్కించుకొన్నారు. పేపరు కవర్లు, బ్యాగులు విక్రయించుకొనే హక్కును గజేంద్ర రూ. 6.70లక్షలు, పోటోలు తీసుకొనే హక్కును కిరణ్ రూ. 1.91లక్షలు, కొబ్బరి చిప్పలు సేకరించుకొనే హక్కును మల్లికార్జున రమణ రూ. 7.70లక్షలు, దేవస్థానం పరిసర ప్రాంతాల్లో స్టీల్, రాగి, ఇత్తప్లేట్లు, జ్యోతులు, హారతి పళ్లాలు విక్రయించుకొనే హక్కును సోము రూ. 90వేలకు హెచ్చుగా పాడి దక్కించుకొన్నారన్నారు. చిత్తూరు జిల్లా దేవాదాయధర్మాదాయశాఖ ఇన్స్‌స్పెక్టర్ శశికుమార్, ఆలయ అధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

## విజ్ఞాన వారోత్సవాలలో విద్యార్థుల విజయోత్సవం



**చంద్రగిరి, మార్చి 6 ప్రభాతవార్త:** విజ్ఞాన వారోత్సవాలు 2026 పోటీలలో విద్యార్థులకు విజయోత్సవం జరుపుకున్నారు. స్థానిక శ్రీపద్మావతీ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం విజ్ఞావారోత్సవాలు 2026 కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించారు. ఇందులో పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్, ఎలోక్యూషన్, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలలో పోస్టర్ ప్రజెంటేషన్‌లో మొదటి బహుమతి చిన్న వెన్నెల 8వ తరగతి, ఎలోక్యూషన్, ప్యాన్సీ డ్రెస్ పోటీలలో మొదటి బహుమతి కె.రాధిక 8వ తరగతి సాధించారు. అదేవిధంగా క్విజ్ పోటీలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల డి.ఎం.హేమచంద్ర టీమ్ మొదటి బహుమతి సాధించారు. విజేతలకు ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, హెచ్ఎం వెంకటరమణ రెడ్డి విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు.

## ప్రమాదంలో క్షతగాత్రుడు మృతి



**చంద్రగిరి, మార్చి 6 ప్రభాతవార్త:** గత నెల 19న బొడెంబాయి వద్ద కారు బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎం.మంజునాథ్ (32) స్విమ్స్‌లో వైద్య చికిత్సలు పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. చంద్రగిరి, పాతపేట, జోగలకాలనీకి చెందిన మంజునాథ్ చంద్రగిరి నుండి పాకాలకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా తిరుపతి నుండి బెంగుళూరు వెళుతున్న కారు వెనుక నుండి మంజునాథ్ వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన మంజునాథ్‌ను తిరుపతి రుయాకు తరలించి, అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం స్విమ్స్‌కు పంపించారు. స్విమ్స్‌లో వైద్య చికిత్సలు పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు వున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# రైల్వే కోడూరు డివిజన్

## కొత్తకోడూరులో మైనారిటీలకు ఇఫ్తార్ విందు



**రైల్వే కోడూరు, మార్చి 6 ప్రభాతవార్త :** రైల్వే కోడూర్ పట్టణంలోని కొత్త కోడూరు నందు ఖాదర్, సలీంల ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసిపి సీనియర్ నాయకులు ముద్దా బాబుల్ రెడ్డి, రామిరెడ్డి ధ్వజా రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొని మైనారిటీలు ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందు నందు పాల్గొన్నారు. మసీదు అధ్యక్షులు శేషాద్ వల్లి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వైసీపీకి చెందిన సర్పంచులు తోట శివ సాయి, ఆర్వి రమణ, మైనారిటీ నాయకుడు షఫీ, పట్టణ అధ్యక్షుడు రమేష్, ప్రతాప్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి తోపాటు ముస్లిం లు భారీగా పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు.

**చిట్వేలి, మార్చి 6 ప్రభాతవార్త:**



జిల్లా ఆరోగ్య అధికారి ఆదేశాల మేరకు పిహెచ్సి వైద్యులు శివప్రసాద్ గౌడ్ మరియు సల్మా ఆధ్వర్యంలో అంగన్వాడి సిబ్బందికి శుక్రవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సల్మా ఐసిడిఎస్ సిబ్బందికి బిపి, మూడు నెలల షుగర్ పరీక్షలు ప్రధానంగా నిర్వహించి, వారి ఆరోగ్య సమస్యల కనుగుణంగా మందులు, జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలోఅంగన్వాడీ సీడీపీఓ నిర్మలా జ్యోతి ,హెల్త్ సూపెర్వైజర్ ఇస్మాయిల్ బాషా, ఏంపీహెచ్ఓ ధనలక్ష్మి, పిహెచ్ఎన్ విజయకుమారి,అంగన్వాడీ సూపర్వైజర్లువసుంధరమ్మ,సురేఖరాణి,ఎమ్ఎల్‌హెచ్పీలుభవ్య, రుఖియా బాను తదితరులు పాల్గొన్నారు.

## చిన్న రాజు పాడు గ్రామంలో..

**మరుగుదొడ్ల స్థలాన్ని కబ్జాకు. ఎప్పిస్తున్న గ్రామస్థాయి నాయకుడు...**

**చర్యలు తీసుకోవాలంటున్న గ్రామస్తులు...**



**ఓబులవారిపల్లి ప్రభాతవార్త మార్చి 6** ఓబులవారిపల్లి మండలం చెన్నరాజుపోడు పంచాయతీలోని సోమవాకుల పల్లె గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వం మరుగుదొడ్లు నిర్మించడంతో ఆ మరుగుదొడ్డి స్థలాన్ని కబ్జా చేసేందుకు ఒక గ్రామస్థాయి జనసేన నాయకుడు గోడలు యంత్రాలతో పగలుగొట్టి చదును చేసి ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు పంచాయతీ అధికారులు రెవెన్యూ అధికారులు చొరవ చూపి భూ కబ్జాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పేకాటలాడుతున్న 10 మంది అరెస్టు

**పలమనేరు, మార్చి 6 ప్రభాతవార్త:** పలమనేరు మున్సిపాల్టీ పరిధిలోని గొబ్బొళ్ళ కోటూరు వద్ద పొలాల్లో పేకాటలాడుతన్న 10 మందిని గురువారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. గ్రామ సమీపంలోని కొత్తచెరువు వద్ద చింతచెట్టు కింది పేకాటలాడుతుండగా ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. బాలక్రిష్ణ, ఖాజాపీర్, లోకేష్, ఇలియాత్, హయత్, రవిచంద్ర, బాబు, శ్రీకాంత్, బుజ్జి అనే వారిని అరెస్టు చేసి రూ.13.200 స్వాధీనం చేసుకున్నారు.

## నేడు ఉపాధి సామాజిక తనిఖీ బహిరంగ సభ

**యాదమరి, మార్చి 6 ప్రభాతవార్త:** ఎంపిడిఓ కార్యాలయ సమీపంలోని సుచి కార్యాలయ ఆవరణలో శనివారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎపిఓ సంధ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బహిరంగ సభకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధి కూలీలు హాజరు కావాలని ఆమె కోరారు.

## జన గణన అత్యంత కీలకం – కలెక్టర్ సుమిత్‌కుమార్



**చిత్తూరు, మార్చి 6 ప్రభాతవార్త:** జనగణన కార్యక్రమంను ప్రతి ఒక్కరు ఒక బాధ్యతగా తీసుకుని అత్యంత నిబద్ధతతో నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ సుమిత కుమార్ పిలుపునిచ్చారు. సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల లోని సమావేశభవనంలో శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ జనగణన శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జనగణన కార్యక్రమం దేశ నిర్మాణంలో అత్యంత కీలకమైన ప్రక్రియ అని, ప్రతి ఒక్క వ్యక్తిని కచ్చితంగా లెక్కించడం అవసరమన్నారు. జనగణన ద్వారా సేకరించి ప్రతి సమాచారం దేశం, రాష్ట్రం, జిల్లా, గ్రామాభివృద్ధికి అత్యంత ప్రాముఖ్యమైందన్నారు. జనగణన ప్రక్రియ 1872 సంవత్సరం నుండి కొనసాగుతుందని, ఇప్పటి వరకు అనేక సార్లు జనగణన నిర్వహిం చడం జరిగిందన్నారు. దేశ ప్రణాళికలు రూపొందించడంలో జనగణన కీలకపాత్ర పోషిస్తుంద న్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రాలకు వచ్చే ఆర్థిక నిధుల కేటాయింపులో సైతం జనాభా ఒక ప్రధాన ప్రమాణంగా వుండటంతో ప్రతి వ్యక్తిని లెక్కించడం ముఖ్యమన్నారు. ఎన్యూమరేటర్లు కొంతమంది వ్యక్తులను లెక్కించకుండా వదిలివేస్తే అది పెద్ద మొత్తంలో జనాభా తగ్గినట్లుగా నమోదు అవుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్, ఎడి సుప్రజ, సిపిఓ శ్రీనివాసరావు, జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, డిఎఫ్ఓ సుబ్బరాజు, అర్డీఓలు, తహసిల్దార్లు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమీషనర్లు, డిప్యుటీ తహసిల్దార్లు, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ హౌస్ నిర్వహించిన మహిళా పోలీసులు



**చిత్తూరుహెల్త్, మార్చి 6 ప్రభాతవార్త:** మహిళా దినో త్సవ వారోత్సవాల్లో భాగంగా చిత్తూరు మహిళా స్టేషన్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా పోలీసులు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. భాగం గా స్థానిక బిఎస్ కన్నన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు మహి ళా పోలీస్ స్టేషన్‌కు వచ్చి స్టేషన్‌లోని విభిన్న విభాగాల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా స్టేషన్ ఎస్ఐలు శివశంకర్, కరీమున్నిసాలు, కన్నన్ హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆర్థిక లావాదేవిలే హత్యకు కారణం

– నాటు తుపాకిలో కాల్చి చంపిన నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



**చిత్తూరు, మార్చి 6 ప్రభాతవార్త:** చిత్తూరు రూరల్ మండలం తుమ్మింద పాళ్యంలో నాటు తుపాకీతో కాల్చి సాయికుమార్‌ను హత్య చేసిన ఢిల్లీబాబును తాలుకా పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సాయి కుమార్, ఢిల్లీబాబులకు గత రెండు సంవత్సరాలుగా ఆర్థిక లావాదేవిలు వున్నాయి. వీరిద్దరు తరచు నాటు తుపాకులు తీసుకుని సమీపంలోని అడవిలోకి వెళ్ళి జంతువులను వేటాడేవారు. అలాగే తరచు పేకాట ఆడుతూ కాలం గడిపేవారు. ఈ క్రమంలో ఢిల్లీబాబు తనకు వున్న అప్పులను తీర్చుకోవడానికి సాయికుమార్ నుండి 2 లక్షల రూపాయలు తీసుకున్నాడు. తీసుకున్న అప్పును తిరిగి చెల్లించాలని సాయికుమార్ తరచు ఢిల్లీబాబును అడుగుతున్నప్పటికీ అతను పట్టించుకోకుండా తన పాటికి తాను వుండేవాడు. సాయికుమార్ తన తల్లిదండ్రులు, స్నేహితులతో కలిసి వెళ్ళి ఢిల్లీబాబును తనకు ఇవ్వాల్సిన డబ్బులు తిరిగి ఇవ్వాల్సిందిగా అడిగితే తాను డబ్బులు తిరిగి ఇవ్వడం సాధ్యం కాదని ఖరాఖండిగా ఢిల్లీబాబు స్పష్టం చేశాడు. ఇకపై తనను డబ్బులు అడిగితే చంపుతానని బూతులు తిట్టేవాడు. ఈ క్రమంలో ఈ నెల 4వ తేదీన సాయికుమార్ గ్రామంలో నిర్మాణంలో వున్న చిన్నబ్బ ఇంటి వద్ద వున్న ఢిల్లీబాబును తన చెల్లెలకు పెళ్ళి నిశ్చయం అయ్యిందని తాను అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని మరోసారి అడిగాడు. ఈ విషయంపై ఇద్దరి మధ్య మాటలు పెరగడంతో అసహనంకు గురైన ఢిల్లీబాబు తాను వేటకు వెళ్ళడానికి సిద్ధంగా వుంచుకున్న నాటు తుపాకి తీసుకుని సాయికుమార్‌ను టార్గెట్ చేసి కాల్చి అక్కడి నుండి పరారీ అయ్యాడు. ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామచంద్ర ఆధ్వర్యంలో తాలుకా ఎస్ఐలు వి.అశోక్‌కుమార్, ఎ.వెంకటనారాయణ, పెనుమూరు ఎస్ఐ బి.శ్రీనివాసులు, ఎన్ఆర్‌పేట ఎస్ఐ వి.మణికంఠేశ్వరరెడ్డి, క్రైమ్ పార్టీ పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి నిందితుడి కోసం గాలింపులు చేపట్టాయి. ఈ క్రమంలో శుక్రవారం చిత్తూరు అర్బన్ మండల పరిధిలో చిత్తూరు–వేలూరు రోడ్డులో గోపాలపురం బస్‌స్టాప్ వద్ద నిందితుడు ఢిల్లీబాబు వున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి వెళ్ళి అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అలాగే నిందితుడు ఢిల్లీబాబు నుండి పోలీసులు హత్యకు ఉపయోగించిన నాటు తుపాకితో పాటు కాల్చడానికి ఉపయోగించిన నల్లమందు రవ్వలను స్వాధీనం చేసుకున్నారు.

## విజ్ఞాన శాస్త్ర వారోత్సవాలలో మండల విద్యార్థులు.



**చిట్వేలి,మార్చి 6, ప్రభాతవార్త:** జిల్లా స్థాయి విజ్ఞానశాస్త్ర వారోత్సవాలలో భాగంగా శుక్రవారం రాయచోటిలో జరిగిన పోటీలలో మండలంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు విజయం సాధించారని ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు తెలియజేశారు. పోస్టర్ ప్రజంటేషన్ నందు 7వతరగతి విద్యార్థి నిఖిలేశ్వర్ మొదటి స్థానం, క్విజ్ పోటీలలో 8వతరగతి విద్యార్థి సాయి సుజిత్ కుమార్ రెడ్డి మొదటిస్థానం, సీనియర్ సెమినార్ విభాగంలో 6వతరగతి విద్యార్థిని బేబీహబ్బా జాన్ ద్వితీయ స్థానంలో విజయం సాధించారన్నారు. అలాగే ఉపాధ్యాయ సెమినార్ విభాగంలో పాఠశాల జీవ శాస్త్ర ఉపాధ్యాయుడు శివనారాయణ గౌడ్ ప్రథమ బహుమతి సాధించారని తెలిపారు. ప్రాథమిక పాఠశాలలనుంచి జూనియర్ ఫ్యాన్సీ డ్రెస్ షో విభాగంలో తుమ్మచెట్ల పల్లి విద్యార్థిని రిషిత సాయి ప్రథమస్థానం, నక్కలపల్లి విద్యార్థి తేజేశ్వరెడ్డి జూనియర్ సెమినార్ విభాగంలో ద్వితీయ స్థానం, జిల్లా స్థాయి లాంగ్వేజ్ పెస్టివల్ లో భాగంగా జరిగిన పోటీలలో దేవమాచుపల్లి పాఠశాల 5వతరగతి విద్యార్థిని చిహ్నిత ఆంగ్ల భాష లాంగ్వేజ్ పెస్టివల్ నందు ప్రథమ స్థానంలో గెలుపొందారని ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను, ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు ఖాజా మొహిద్దీన్, ఈశ్వరయ్య లు, ఉపాధ్యాయబృందం అభినంధించినట్లు దుర్గరాజు తెలియ జేశారు.మండలం తరపున ఈ కార్యక్రంలో ఉపాధ్యాయులు పసుపుల. రాజశేఖర్, సుహాసిని, నారాయణ రెడ్డి, శివనారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఘనంగా శ్రీ కల్కి భగవాన్...

**77వ జన్మదిన వేడుకలకు ఆహ్వానం**



**వరదయ్యపాలెం, మార్చి 6 ప్రభాతవార్త:** వరదయ్యపాలెంలోని గోవర్ధనపురం లోకా ఫౌండేషన్ కార్యాలయంలో ఏకం, లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేది శ్రీ కల్కి భగవాన్ 77వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఏకం బృందం స్పిరిచువల్ కోఆర్డినేటర్ బొప్పన రమేష్ గ్రామ, పరిసర గ్రామ ప్రజలకు, భక్తులను ఆహ్వానించారు. శ్రీ భగవాన్ వారి 77వ జన్మదిన శుభ సందర్భంగా భక్త జనులకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సకల సంపదలు, కార్యసిద్ధి, ముక్తి చైతన్యం సిద్దించాలనే సంకల్పంతో నిర్వహిస్తున్న శ్రీ భగవాన్ పాదుకపూజ, భజనలు, కోలాటంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## ఆటో... స్కూల్ వ్యాన్ ఢీ

**ఒకరు మృతి మరొకరి పరిస్థితి విషమం**



**చంద్రగిరి, మార్చి 6 ప్రభాతవార్త:** ఆటో స్కూల్ వ్యాన్ ఎదురెదురుగా ఢీ కొట్టుకోవడంతో ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా వున్నట్లు ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. స్థానిక నాగాలమ్మ ఆలయానికి సమీపంలో శుక్రవారం బైపాస్ వద్ద సర్వీస్ రోడ్డులో చంద్రగిరికి వస్తున్న ఆటో, చంద్రగిరి నుండి వెళుతున్న శ్రీ చైతన్య ఇంగ్లీషు మీడియం స్కూల్ వ్యాన్ రెండూ ఎదురెదురుగా అతి వేగంతో ఢీకొట్టుకున్నారు. ఈ ప్రమాదంలో ఏజి పల్లికి చెందిన చంద్రబాబు (45) అక్కడికక్కడే మృతి చెందాడు. అదేవిధంగా మంగళం పేటకు చెందిన చెంగ్రాయులు తీవ్రగాయాలపాలయ్యాడు. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా ధ్వంసం కావడంతో రోడ్డు ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి తమ సిబ్బందితో సంఘటనా స్థలికి చేరుకుని ఆటో విడిభాగాలను తొలగించి, క్షతగాత్రుడిని 108 ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.ప్రమాదానికికారణమైనస్కూల్‌వ్యాన్‌నుపోలీసులు స్టేషన్‌కు తరలించారు. కేసు విచారణ చేస్తున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అభివృద్ధి...సంక్షేమ పథకాలు ప్రజలకు తెలపాలి

– ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



**కుప్పం, మార్చి 6 ప్రభాతవార్త:** సిఎం చంద్రబాబునాయుడు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శుక్రవారం చీకటిపల్లిలో జరిగిన కుటుంబ సాధికార సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరవై నెలల పాలనలోనే ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం సిఎం చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను ఆర్థికలోటున్నా ప్రజలకు ఇచ్చిన మాట మేరకు పథకాలు అందిస్తున్నారన్నారు. కుప్పం రైతుల కోసం కృష్ణాజలాలు తెచ్చారన్నారు. వేలకోట్లతో కుప్పంలో యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు పరిశ్రమలు తెస్తున్నారన్నారు. కెఎస్ఎస్ సభ్యులు ప్రజల దగ్గరకు వెళ్లి వారి సాధక బాధలు తెలుసుకుని సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని సూచించారు.కార్యక్రమంలో పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, కుప్పం మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, టిడిపి మండల అధ్యక్షుడు సుబ్బు, నేతలు బాబు, హేమాంబర గౌడు తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ నిర్మాణంకు పూజ



**కుప్పం, మార్చి 6 ప్రభాతవార్త :** మండలంలోని కంగుంది పంచాయతీ ఎస్సీ కాలనీలో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాలు నిర్మాణం పనులు పూర్తిచేసేందుకు శుక్రవారం ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పూజ చేసి పనులు ప్రారంభించారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో త్వరలోనే భవన నిర్మాణం పూర్తి చేసి అందుబాటులో తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దనశేఖర్, నేతలు షరీఫ్, లోకేష్, మునాఫ్, రాజేం ద్ర తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పక్షపాతి సిఎం చంద్రబాబు



**కుప్పం, మార్చి 6 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి అని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మిట్టపల్లిలో రైతులకు రాజము ద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వే తప్పుల తడకగా ఉండడంతో పాటు రైతుల భూవివరాలు గందరగోళంగా మారాయన్నారు. దీంతో మరలా కూటమి ప్రభుత్వం గ్రామాల్లో రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే చేస్తూ పక్కాగా కొలతలు తీసి ఆ వివరాలు పాస్‌పుస్తకాల్లో పొందుపరచి రైతులకు పుస్తకాలు అందించడం జరుగుతోందన్నారు. రైతులు కూడా రీసర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పిసి సాంబశివం, కడ సభ్యుడు రామచంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, కనీసవేతనాల సలహామండలి సభ్యుడు శరవణ, నేతలు చలపతి, లీలా వెంకటేష్, సంతోష్, కనకరాజు, మంజు, శివ, షబ్బీర్, ఇమ్రాన్, రైతులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి విజ్ఞాన వారోత్సవాల్లో బిందుశ్రీ మూడోస్థానం



**గుడుపల్లె, మార్చి 6 ప్రభాతవార్త:** జిల్లా విద్యాశాఖాధికారి రాజేంద్ర ప్రసాద్ అధ్వర్యంలో శుక్రవారం చిత్తూరులో జరిగిన విజ్ఞాన వారోత్సవాల్లో గుడుపల్లె ఏపి మోడల్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని బిందుశ్రీ ఉత్తమ ప్రతిభ చాటింది. జిల్లా స్థాయిలో తృతీయ బహుమతిని అందుకుంది. డిఇఒ చేతుల మీదుగా బిందుశ్రీ అవార్డు అందుకుంది. ఈసందర్భంగా బాలికను ఉపాధ్యాయులు అభినందించారు.

## నవియాల సమీపంలో ఒంటరి ఏనుగు



**రామకుప్పం, మార్చి 6 ప్రభాతవార్త :** మండలంలోని ననియాల ప్రధాన మార్గంలో ఒంటరి ఏనుగు గురువారం రాత్రి సంచరించింది. గత పదిరోజులుగా ఈ ఏనుగు ననియాల సమీపంలో తిరుగుతూ రైతులు సాగు చేస్తున్న పంటలపై దాడులు చేస్తోంది. అటవీ అధికారులు దారి మళ్లింపుకు ప్రయత్నాలు చేస్తున్నా ఏనుగు పగటిపూట అడవిలో ఉంటూ రాత్రి పంటలపై దాడులు చేస్తోంది. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని పంటలపై ఏనుగు దాడుల నిరోధానికి కుంకీ ఏనుగుల సాయంతో తమిళనాడులోకి తరిమేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## డిపో నిర్మాణ స్థలం పరిశీలించిన జాయింట్ కలెక్టర్



**కుప్పం, మార్చి 6 ప్రభాతవార్త :** కుప్పం ఆర్టీసీ డిపో నూతన నిర్మాణ స్థలాన్ని శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పరిశీలించారు. కుప్పంలో ఉన్న ఆర్టీసీ డిపోను మండలంలోని గుట్టపల్లి సమీపంలో సుమారు 15 ఎకరాల్లో నిర్మించాలని ఇదివరకే నిర్ణయించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో డిపో నిర్మాణ స్థలాన్ని జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. భూవివరాలను రెవెన్యూ అధికారులు, సరే ్వయర్లను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాల్, డిపో మేనేజర్ టికెస్వామి, విఆర్వో, సర్వేయర్లు పాల్గొన్నారు. అనంతరం కడ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు.

## ఓటర్ల జాబితా తయారీపై కసరత్తులు

**కుప్పం, మార్చి 6 ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ, మండల పరిషత్‌లకు ప్రస్తుతం ఉన్న సర్పంచులు, ఎంపిపిలు, జడ్పీటీసీల పదవీ కాలం అతిత్వరలో ముగియనున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఎన్నికల కమీషనర్ ఓటర్ల జాబితా తయారీకి తగు ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఎన్నికల నిర్వహణలో కీలకమైన ఓటర్ల జాబితాలను అధికార యంత్రాంగం సిద్ధం చేస్తోంది. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రస్తుతం ఓటర్ల జాబితాల రూపకల్పనలో నిమగ్నమయ్యారు. ఇదివరకు ఉన్న ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి ఒక్కో గ్రామ పంచాయతీకి సంబంధించి ఆయా పంచాయతీలో ఉన్న ఓటర్లు మాత్రమే జాబితాలో ఉండేలా ప్రతి పంచాయతీకి ఓ ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నారు.

## గణనాధుని సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



**కాణిపాకం, మార్చి 6 ప్రభాతవార్త:** భారత సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్‌కుమార్ శుక్రవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ రవీంద్ర ాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈకార్యక్రమంలో చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీధం నాయుడు, చిత్తూరు కోర్టు న్యాయమూర్తులు, ఆలయ సూపరెంటెంట్ వాసు, టెంపుల్ ఇన స్పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అర్ధగిరిలో త్రికాల నైవేద్యానికి దాతల విరాళం

**తవణంపల్లె, మార్చి 6 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో ప్రతి రోజూ స్వామివారికి నిర్వహించే త్రికాల నైవేద్యానికి రెండేళ్ళ కాలానికి అవసరమైన సరుకులను మండలంలోని కొండ్రాజుకాల్వ సర్పంచ్, మండల టీడీపీ నాయకులు దొడ్ల పరందామనాయుడు దంపతులు విరాళంగా ప్రకటించారు. ఆలయ ఛైర్మన్ ఎ.రఘుపతి అభ్యర్థన మేరకు స్వామివారి త్రికాల నైవేద్యం కోసం అవసరమైన సరుకులు కొనుగోలు కోసం రోజుకు 2,500 రూపాయలు వంతున ఛైర్మన్‌గా రఘుపతి పదవీకాలం వున్నంత కాలం వరకు సుమారు రెండేళ్ళ కాలానికి అందిస్తామని దొడ్ల పరందామనాయుడు దంపతులు ప్రకటించారు. ఈమేరకు దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం ఛైర్మన్ రఘుపతి,ఈఓ మునిశేఖర్‌ల ఆధ్వర్యంలో స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వర చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

**బంగారుపాళ్యం, మార్చి 6 ప్రభాతవార్త:** బంగారుపాళ్యం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా వున్న సహాయకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఓ వినూతశ్రీ తెలిపారు.వివరాలకు సంబంధిత కార్యాలయంలో సంప్రదించాలని సిడిపిఓ తెలిపారు.

## 10న కుప్పం మండల మీట్

**కుప్పం, మార్చి 6 ప్రభాతవార్త :** కుప్పం మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 10వతేది ఉదయం 10.30గంటలకు కుప్పం మండల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశంకు ఎంపికైన సభ్యులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరోగ్య పరీక్షలు



**పుత్తూరు రూరల్, మార్చి 6 ప్రభాతవార్త:** పుత్తూరు మండలంలోని గోవింద పాలెం యూపీహెచ్‌సీ ఆరోగ్య కేంద్రం, ఆరేటమ్మ యూపీహెచ్‌సీ, గొల్లపల్లి పీహెచ్‌సీ, పీఆర్ మంగళం ఆరోగ్య కేంద్రంలోను అంగన్ వాడీ కార్యకర్తలకు జనరల్ చెకప్ రక్త పరీక్షలు అవసరమైన మందులను పంపిణీ, మహిళల ఆరోగ్య పరీక్షలపై వైద్యులు అవగాహన కల్పించారు.సీడీపీవో పి.సంధ్యారాణి, సూపర్‌వైజర్ శ్రీదేవి, అనిత, వైద్య అధికారిఎస్.ఎం.ప్రవీణ్‌కుమార్,రమేష్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

## వైభవంగా సంకటహర చతుర్థి



**పుత్తూరు రూరల్, మార్చి 6 ప్రభాతవార్త:** పుత్తూరు మున్సిపల్ పరిధిలోని బత్తలవారి కండ్రిగ గ్రామంలో వెలసిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో సంకటహర చతుర్థిపూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అలాగే గ్రామంలోని గంగమ్మ తల్లికి శ్రీ రామాలయంలోని శ్రీరామచంద్ర భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పట్టణంలోని బెస్తవీధిలో వెలసిన శ్రీ తరుణ గణపతి ఆలయంలో బజారు వీధిలోని వినాయకస్వామి ఆలయం, తొరూరు వరసిద్ధి వినాయక స్వామి ఆలయాల్లో అభిషేకాలు, అలంకరణలు చేశారు.

## బాల్య వివాహాలు బాలల హక్కులను హరిస్తాయి



**విజయపురం, మార్చి 6 ప్రభాతవార్త:** మండలంలోని జగన్నాథపురం గ్రామ సచివాలయంలో శుక్రవారం సర్పంచ్ అధ్యక్షతన బాల్య వివాహాలపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు లక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలల హక్కులను హరిస్తాయని, విద్యతో పాటు భవిష్యత్ నాశనమవుతుందని పేర్కొన్నారు. కావున ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలు జరగకుండా అధికారులకు సహకరించాలని కోరారు. అత్యవసర సమయంలో 1098ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు జ్యోతిలక్ష్మి, చాముండేశ్వరి, తేజ, ఆముద, వెల్ఫేర్ అసిస్టెంట్ హరిబాబు, టీచరు బాబు, ఏఎన్ఎం సుమతి, ఆశ వర్కరు కుమారి, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంచినీటి పథకాలను పరిశీలిస్తున్న ఇంజనీర్లు



**విజయపురం, మార్చి 6 ప్రభాతవార్త:** మండలంలోని ఇళ్ళత్తూరు సమీపంలో ఉన్న రాజీవ్ టెక్నాలజీ మిషన్ మంచినీటి సరఫరా పథకాన్ని శుక్రవారం ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ విజయకుమార్, డీఈ శ్రీహరి, ఏఈఈ గిరీష్‌కుమార్, స్థానిక టీడీపీ నాయకుడు ఏళుమలై పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని మంచినీటి అవసరాలకు అధిక ప్రాధాన్యతనిచ్చి చర్యలు తీసుకోవాలని కోరారు.

## సామాన్య భక్తులే వివిపిలు



**తిరుమల,మార్చి 6ప్రభాతవార్తప్రతినిధి:** సామాన్య భక్తులకు అసౌకర్యం కలగకుండా దర్శన ఏర్పాట్లలో పారదర్శకత పెంపొందిస్తామని టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర తెలిపారు. గత నెలరోజులు ఈఓగా అదనపు బాధ్యతలు నిర్వహించి,చాలా విషయాలు నేర్చుకున్నానని ,భక్తుడిగా సేవ చేస్తానని ఈఓ ఉద్ఘాటించారు. తనకు ఇంత గొప్ప అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.శుక్రవారం ఉదయం తిరుమల ఆలయంలో పూర్తిస్థాయి ఈఓగా ముద్దాడ రవిచంద్రతో బంగారు వాకిలిలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ అవకాశం రావడం పూర్వజన్మ సుకృతమని సంతోషం వ్యక్తం చేశారు. తిరుమలలో ఉదయం రవిచంద్ర దంపతులు తొలుత భూవరాహ స్వామిని దర్శించుకున్నారు. శ్రీవారి ఆలయంలోనికి చేరుకుని ఈఓ స్థాయిలో టిటిడి బోర్డు ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా కూడా ప్రమాణ స్వీకారం చేశారు.

## పదోతరగతి విద్యార్థులకు రూయాప్స్ఇతోధిక సాయం

**పాలసముద్రం,మార్చి 6ప్రభాతవార్త:** త్వరలో పదవతరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు విజయం కలగాలని, అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షిస్తూ రూరల్ యాక్షన్ ఫర్ సోషల్ సంస్థ సెక్రటరీ పి.చిట్టిబాబు అవసరమైన సామాగ్రిని అందజేశారు. శుక్రవారం ఉదయం పాలసముద్రం మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుని ఈనెలలో పదవతరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు అవసరమైన వస్తువులు పంపిణీ చేశారు. రూరల్ యాక్షన్ సంస్థ సెక్రటరీ, జిల్లా వినియోగదారుల సభ్యుడు, చిట్టిబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను చక్కగా చదువుకొని, ఉన్నత స్థానాలకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధనరాజు, వైవిఎల్ కుమార్,మల్లేశ్వరి, సంస్థ మహిళలు కన్వీనర్ షాలిని, సంస్థ సిఆర్ఐ ప్రోగ్రామ్ ఆర్గనైజర్ నాగరాజు ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సంకట హర చతుర్థి



**తిరుపతి,మార్చి 6 ప్రభాతవార్త:** వినాయక సాగర్ లోని సంకల్ప సిద్ధి వినాయక స్వామి ఆలయంలో శుక్రవారం సంకట హర చతుర్థి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి శోభాయమానంగా అలంకరించి నైవేద్యం సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాదాలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితుడు సురేష్ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు గుండాల గోపీనాథ్ రెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, లోక ప్రభాకర్ నాయుడు సుధాకర్ ఆచారి ,దేవేంద్ర కుమార్, నిర్మల, ప్రసాద్,శాంతిప్రియ, రత్నజ కినీశా రెడ్డి, తన్విష్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం త్రాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష



**రేణిగుంట, మార్చి 6 ప్రభాతవార్త:** రేణిగుంట మండలం రూరల్ సర్కిల్ గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం త్రాగి వాహనం నడిపిన నెల్లూరు ఎన్టీఆర్ నగర్ కు చెందిన గన్నవరం హరి (25) కి తిరుపతి స్పెషల్ జేఎస్ సీఎం కోర్టు న్యాయమూర్తి 21 రోజుల జైలు శిక్ష విధించి శుక్రవారం సంచలనాత్మక తీర్పునిచ్చారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.... జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డిఎస్పి శ్రీనివాసరావు సూచనలతో గాజులమండ్యం పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తుండగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు పట్టణం ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన గన్నవరం హరి మద్యం త్రాగి కారు నడుపుతూ పట్టుబడ్డాడు. నిందితుడిపై మోటార్ వెహికల్ యాక్ట్ 185 ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేసి తిరుపతి స్పెషల్ జే ఎస్ సీఎం న్యాయస్థానంలో హాజరు పరిచారు. నిందితుడు కోర్టులో తన నేరాన్ని అంగీకరించడం న్యాయమూర్తి బి.ఎన్. ఎస్.ఎస్ సెక్షన్ 275 ప్రకారం 21 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. న్యాయమూర్తి విధించిన తీర్పు మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి కనువిప్పు కావాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**పాకాల, మార్చి 6 ప్రభాతవార్త:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) సందర్భంగా పాకాల పట్టణంలోని స్థానిక ఎన్.వి.ఎన్ పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు ఎంఈఓ బాబ్జి, ఎంఈఓ లింగయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల హక్కులు, విజయాలు మరియు సమాజంలో వారి కీలక పాత్రను స్మరించుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. పురుషులతో సమానంగా మహిళలకు కూడా అవకాశాలు, హక్కులు, గౌరవం కల్పించాలని సూచించారు. ఈ దినోత్సవం మహిళల కలలను నిజం చేసుకునేందుకు సమాజం మొత్తం మద్దతుగా నిలవాలని, ప్రతి మహిళ తనలో ఉన్న శక్తిని గుర్తించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం మహిళా ఉపాధ్యాయులను ఎంఈఓలు, పురుష ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలకు వైద్య పరీక్షలు

**పాకాల, మార్చి 6 ప్రభాతవార్త:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాకాల



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకరాళ్లకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. చంద్రగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పాకాల 1, 2 సెక్టార్‌లకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకరాళ్లు ఈ వైద్య శిబిరంలో పాల్గొన్నారు. మార్చి 8న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందజేశారు. మహిళల ఆరోగ్య పరిరక్షణపై మెడికల్ ఆఫీసర్ డా. జి. అలెగ్జాండర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు చిట్టెమ్మ, వెంకటరమణ, ఎస్. సుధా, ఎన్. డిస్నీ, ఐసీడీఎస్ సూపర్వైజర్ కిరణ్మయి, మెడికల్ ఆఫీసర్ డా. అరవింద్ కుమార్, స్టాఫ్ నర్స్ పుష్పతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## డీడీఈ పీజీ ఫలితాలు విడుదల.

**తిరుపతి విద్య మార్చి 6 ప్రభాతవార్త.**

ఎస్వీయూ డీడీఈ విభాగం పీజీ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ఫైనల్ ఇయర్ ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు డీన్ ఆచార్య కొంగర సురేంద్రబాబు, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రాజామాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం అభ్యర్థులు వర్సిటీ అధికారిక వెబ్సైట్ను సంప్రదించాలని సూచించారు.

## పంచాయతీ రికార్డుల పరిశీలనకు అనుమతి ఇవ్వండి



**తిరుపతిరూరల్, మార్చి6 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ మండలం చిగురువాడ గ్రామ పంచాయతీ రికార్డుల పరిశీలనకు అనుమతి ఇవ్వాలని వార్డు సభ్యుడు ఎం.కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు.తిరుపతిరూరల్ ఎంపిడిఓ మస్తాన్ వల్లిని కలిసి వినతిపత్రం అం దజేశారు. 2019 నుండి ఇప్పటి వరకు పంచాయతీ రికార్డులను పరిశీ లనకుఅనుమతి ఇవ్వాలన్నారు.ఇంటి పన్నులు, అభివృద్ధి పనులు, జీతభత్యాలు, ఇంటి అప్రూవల్స్ తదితరవిషయాలను తెలుసు కొనుటకు అనమతి కోరారు.

## రేపు మండల సర్వసభ్య సమావేశం



**తిరుపతిరూరల్, మార్చి 6 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ మండల ప్రజా పరిషత్ సాధారణ సమావేశం ఈనెల 8న ఉదయం 10:30గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఓ) ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు (ఎంపిటిసి)లు, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. మండల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామాల్లోని సమస్యలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల అమలు, గ్రామస్థాయిలో ఎదురవుతున్నసమస్యల పరిష్కారం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించనున్నట్లు తెలిపారు.

## బుడతలు కాదు... బుల్లి శాస్త్రవేత్తలు

**రేణిగుంట మార్చి 6 ప్రభాతవార్త:** బుడతలు కాదు బుల్లి శాస్త్రవేత్తలు అని తాము చేసిన చిన్నచిన్న



ప్రయోగాలను రెయిన్బో విద్యా సంస్థలో నిర్వహించిన సైన్స్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రెయిన్బో స్కూల్లో ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శన నందు నిరూపించుకున్నారు. కిండర్ గార్డియన్ చిన్నారి విద్యార్థులు, జూనియర్ కేజీ, సీనియర్ కేజీ విద్యా ర్థులు తరగతిలో తాము నేర్చుకున్న రూపకాలను చిన్నారి చేతులతో రూపొందించి ప్రదర్శనలో ఉంచి వాటి ప్రయోగాలను సందర్శకులకు వివరించి అందరిని అబ్బుర పరిచారు. వారు తయారు చేసిన నీటి చక్రం, మొక్కల పెరుగుదల, రంగుల కలయిక, అయస్కాంత క్షేత్రం తదితర భౌతికశాస్త్ర రూపకాలు అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థుల్లో దాగివున్న విజ్ఞానాన్ని వెలికి తీయడం కోసం ఇలాంటి ప్రదర్శనలు ప్రతి ఏటా ఏర్పాటు చేస్తున్నామని విద్యాసంస్థల చైర్మన్ అత్తావుల్ల ఖాన్, ప్రిన్సిపల్ షహరాబాను తెలిపారు.

## జకాత్ అర్హులైన నిరుపేదలకే ఇవ్వాలి!: రేహాన్

**శ్రీకాళహస్తి,మార్చి 6 ప్రభాతవార్త:** సమాజంలో ముస్లింలు ఆచరించాల్సిన ఐదు సూత్రాల్లో అల్లాహ్



స్పష్టంగా నమాజుతో పాటు జాకాత్‌కు సంబంధించి వివరించారని హాఫీజే ఖుర్ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియా మస్జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా మాట్లాడుతూ నేడు సమాజంలో దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఆదేశించినట్లు ఆచరించటం లేదని మన ఇష్టప్రకారం నడుచు కుంటూ మంచి చేస్తూ పాపాలను మూటకట్టు కుంటున్నామని వివరించారు. జకాత్ ఇవ్వటానికి ఒక రంజాన్ మాసమే అవసరం లేదని ఏడాది కాలం కొలమానంగా మన వద్ద మిగులు సొమ్ములపై జకాత్ చెల్లించాలన్నారు. మనం ఇచ్చే సొమ్ములు సద్వినియోగం కావాలని అందుకు సరైన మార్గాన్ని ఎంచుకోవాలని రేహాన్ సూచించారు. అయితే జకాత్ సొమ్మును మసీదులకు ఇవ్వకూడదన్నారు. ఈ అంశాలను గుర్తించుకుంటూ జకాత్‌ను చెల్లించాలని ఆయన సూచించారు.

## శ్రీకాళహస్తి పది పరీక్షా కేంద్రాలు

**శ్రీకాళహస్తి,మార్చి 6 ప్రభాతవార్త:** పట్టణంలో ఈ నెల 16 నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలకు విద్యాశాఖ సిద్ధం చేస్తుంది.ఈ మేరకు విద్యాశాఖ శుక్రవారం ఓ ప్రకటనలో ఎక్కడెక్కడ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారో అక్కడ ఎంత మంది విద్యార్థులు పరీక్షలు రాయాలో వివరించారు.ఈ నేపధ్యంలో 12 కేంద్రాలను ఏర్పాటు చేసారు. అందులో 2213 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

## దళిత వాడలంటే కమిషనర్‌కు ఎందుకింత వివక్ష

**శ్రీకాళహస్తి,మార్చి 6 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలోని విఎం పల్లి దళిత వాడపట్ల మున్సిపల్ అధికారుల



వివక్ష అంటూ మహిళలు రోడ్డెక్కారు. శుక్రవారం వైసిపి ఎస్సి ఎస్సి సెల్ రాష్ట్ర కార్యదర్శి చింత రాజేంద్ర పర్యవేక్షణలో అందోళనకు దిగారు. బాధితులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇంటి పన్నులు చెల్లించలేదనే నెపంతో మంచి నీటిన బంద్‌చేయటం గమనిస్తే దళితుల పట్ల అధికారుల వైఖరి ఏమిటో అర్థమౌతుందని ధ్వజమెత్తారు. దళిత వాడ నుంచే ఇతర ప్రాంతాలకు మంచినీటి సరఫరా జరుగుతుంటే అధికారుల ఆదేశాలతో మంచినీటి సరఫరా సిబ్బంది పైప్ లైన్ వాల్వ్ తీసుకెళ్ళి సీటి సరఫరాను ఆపివేయటం మున్సిపల్ కమిషనర్ అప్రజాస్వామిక విధానాలకు నిదర్శనం అన్నారు. ఇతర వార్డుల్లో సంపన్న వర్గాలు కూడా పన్నుల బకాయిలు ఉన్నారు.అక్కడ నీటి సరఫరా అపివేయగలరా?అని ప్రశ్నించారు. సమాచారం అందిన వెంటనే టూటౌన్ సిఐ నాగరాజు, తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ నాయుడు అధికారులతో ధర్నా స్థలానికి చేరుకొని బాధితులను విచారించి మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్‌ను చరవాణి ద్వారా మాట్లాడి మంచినీటి సరఫరాను పునరుద్ధరించారు.

## యువతరం సేవా సమితిచే పరీక్షా సామగ్రి పంపిణి

**శ్రీకాళహస్తి,మార్చి 6 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలోని యువతరం సేవా సమితిచే శుక్రవారం పదవ తరగతి



విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందించారు. త్వరలో జరగనున్న పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉపయోగపడే సామగ్రిని సేకరించి అందించారు.పట్టణంలోని తెలుగుగంగ కాలనీలో ఉన్న గిరిజన బాలికల గురుకులం పాఠశాలలో 63 మందికి, రాజీవ్ నగర్‌లోని ప్రతిభ పాఠశాలలో 20 మందికి అందించారు. ఈ కార్యక్రమాల్లో యువతరం సేవా సమితి సభ్యులు కిషోర్,కోటేశ్వరబాబు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉద్యమంగా జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు

**శ్రీకాళహస్తి,మార్చి 6 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి నియో జకవర్గంలోజనసేన 'ఉద్యమి' సభ్యత్వ కార్యక్ర



మాలు ఓ ఉద్యమంలా సాగుతుందని శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ ఉమ్మడి చిత్తూరుజిల్లాల కార్యదర్శి కొట్టెసాయి ప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండు పరిసరాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాలను నిర్వహించారు. ఆర్‌టిసి బస్టాండు కూడలిలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో వ్యాపారులు,తోపుడు బండ్ల వ్యాపారులతో చర్చించి సభ్యత్వం నమోదు చేసారు.ఈ సభ్యత్వ కార్యక్రమాల్లో ఆయనతో పాటు కుమార్, జయప్రకాష్,మహేష్, గరికపాటి చంద్ర,.జానిబాషా, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 8న వివాహ పరిచయ వేదిక

**తిరుపతి కలెక్టరేట్, మార్చి 6 ప్రభాతవార్త :** ఈ నెల 8న తిరుపతిలో జరగనున్న వన్నియకుల క్షత్రియ ఆత్మీయ సమ్మేళనం వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు తిరుపతి జిల్లా వన్నియకుల క్షత్రియ సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ వన్నియకుల క్షత్రియులు రానున్న రోజుల్లో ఐక్యంగా సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. వన్నియకుల క్షత్రియలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు వన్నియకుల క్షత్రియులు ఆత్మీయ సమ్మేళనం మరియు వధూవరుల వివాహ వేదికను నిర్వహిస్తున్నమన్నారు. ఈ నెల 8న నేషనల్ హైవే పక్కన తన్నపల్లి క్రాస్ అదిత్ గ్రాండ్ ఎదురుగా తాజ్ హోటల్ దగ్గర నిర్వహించే వన్నెకుల క్షత్రియ ఆత్మీయ సమ్మేళనంలోవన్నియకుల క్షత్రియులు సోదరులు, యువత, మహిళలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## బోదకాల నిర్మూలనకు వ్యక్తిగత శుభ్రత అవసరం

**రామచంద్రాపురం, మార్చి 6 ప్రభాతవార్త:** బోదకాల నిర్మూలనకు వ్యక్తిగత శుభ్రత అవసరమని డిఎం



అండ్‌హెచ్ఓ డాక్టర్ వి.బాలకృష్ణ నాయక్ అన్నారు. శుక్రవారం కమ్మపల్లి, కుప్పం బాదూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జాతీయ బోదకాల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎంఈ డైరెక్టర్ చినబాబుతో కలసి ఆయన ఎంఎండిపి కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోదకాలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు. ఇప్పటికే బోదకాలతో బాధపడుతున్న వ్యక్తులు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధిని పూర్తి స్థాయిలో అదుపు చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్‌కుమార్, డివిజనల్ మలేరియా అధికారి మోహన్‌బాబు, వైద్యాధికారులు డాక్టర్ తేజ, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ పూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## అలరించిన నృత్యం... ఆకట్టుకున్న ర్యాంప్ వాక్.



ఘనంగా ముగిసిన తరంగ్2026.

**తిరుపతి విద్య మార్చి 6 ప్రభాతవార్త:** స్థానిక కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో వార్షికోత్సవంలో భాగంగా గత రెండు రోజులుగా జరుగుతున్న తరంగ్2026 కార్యక్రమం శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పదర్శించిన పలు సాంస్కృత, నృత్య ప్రదర్శనలను అలరించాయి. ఇందులో భాగంగా విద్యార్థులు స్కిట్స్, ట్రెడిషనల్, వెస్టర్న్ డాన్స్ తో వీక్షకులను అలరించారు. అనంతరం దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన వస్త్రలంకరణ ధరించి రాంప్ వాక్ చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ మన్నెం అరవిందుకుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న కళలను ప్రోత్సాహించటానికి ప్రతి సంవత్సరం కళాశాల వార్షికోత్సవం నిర్వహించటం జరుగుతుందన్నారు. రెండు రోజుల పాటు జరిగిన తరంగ్ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాసు, కన్వీనర్ డాక్టర్ నాగేంద్ర, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జువాలజీ పేపర్2 పరీక్షకు 251 మంది గైర్హాజరు.

**తిరుపతి విద్య మార్చి 6 ప్రభాతవార్త.** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 82 కేంద్రాలలో జరిగిన ఇంటర్ సెకండ్ ఇయర్ జువాలజీ పేపర్2 పరీక్షకు 251 మంది గైర్హాజరైనట్లు ఆర్ ఐఓ జి రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 8,798 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 8547 మంది హాజరయ్యారని తెలియజేశారు.అలాగే జిల్లాలో 14 పరీక్షా కేంద్రాలలో జరిగిన ఒకేషనల్ పరీక్షలకు 1082 మందికి గాను 1050మంది హాజరయ్యారని, పరీక్షలు ప్రశాంత వాతావరణలో జరుగుతున్నాయని పేర్కొన్నారు. శనివారం ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఎకనామిక్స్ పేపర్1 పరీక్ష జరగనున్నట్లు తెలిపారు.

## ఉన్నత విద్యలో గణనీయ మార్పులు . ఆచార్య మధురమూర్తి



**తిరుపతి విద్య మార్చి 6 ప్రభాతవార్త.** భవిష్యత్తులో ఉన్నత విద్యలో మార్పులు రాబోతున్నాయని ఇందు కోసం విశ్వవిద్యాలయాలు, అధ్యాపకులు సన్నద్ధం కావాలని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధురమూర్తి తెలిపారు. శుక్రవారం ఎస్వీయూను సందర్శించిన ఆయన వీసీ టాటా నర్సింగరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడుతో కలిసి ప్రిన్సిపాళ్లు, డీన్ లతో పలు అంశాలపై సమావేశమై చర్చించారు. అనంతరం ఆయన అధికారులకు దిశానిర్దేశం చేస్తూ విద్యార్థులకు శిక్షణ, ఉద్యోగ కల్పనపై దృష్టి పెట్టాలని, అకడమిక్ క్యాలెండర్ కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని విశ్వవిద్యాలయాలు ఒకే సారి పరీక్షలు నిర్వహించాలని కోరారు. లా, ఎడ్యుకేషన్, ఫార్మసీ కోర్సుల్లో గత సంవత్సరం ఆలస్యంగా అడ్మిషన్లు జరిగాయని, లోకల్, నాన్ లోకల్ విధానం కోసం సుప్రీంకోర్టు తీర్పు కోసం ఆలస్యమైందని అన్నారు. కృత్రిమ మేధస్సుతో మంచి ఫలితాలు వస్తాయని,అయితే విద్యార్థులతో ముఖాముఖి వుండదని, ఇది పాఠాలు చెప్పడం ఛాలెంజ్ గా మారుతున్న దశ అని గుర్తు చేశారు. పరిశోధనల విషయంలో కొన్ని విశ్వవిద్యాలయాలు కలసి క్లస్టర్ గా ఏర్పడి పరిశోధనలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య సుధారాణి, ఆచార్య వెంకటేశ్వర్లు, ఆచార్య ఓవియస్. రెడ్డి, ఆచార్య శ్రీనివాసులు, డీన్లు ఆచార్య బాలాజీ, ఆచార్య నరసింహ, రమేష్ బాబు, ఆచార్య రాజేంద్ర ప్రసాద్, ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సివిల్స్ లో మెరిసిన తిరుపతి అమ్మాయి.

**తిరుపతి విద్య మార్చి 6 ప్రభాతవార్త.** యూపీఎస్సీ శుక్రవారం విడుదల చేసిన



సివిల్స్ సర్వీసెస్ ఫలితాల ల్లో తిరుపతికి చెందిన యారాశి. తుషారిక రెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబరచి 393 ర్యాంక్ సాధించింది. ఆమె తండ్రి వైఎం గురువారెడ్డి తిరుపతి బీఎస్ఎన్ఎల్లో రిటైర్డ్ ఉద్యోగి. తల్లి ఏ మల్లీశ్వరి టీటీడీలో సూపరింటెండెంట్ గా విధులు నిర్వహిస్తోంది. టీటీడీ పరిపాలనా భవనం వద్దగల టీటీడీ క్వార్టర్స్ లో నివాసముంటున్నారు. స్థానిక కేశవరెడ్డి పాఠశాలల్లో ప్రాథమిక విద్యను పూర్తి చేసి, ఇంటర్ నారాయణ కళాశాలలో చదివిన ఆమె చెన్నైలోని ఎస్ఎస్ఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూని కేషన్లో బీటెక్ పూర్తి చేసిన వెంటనే ఢిల్లీలో ఓ ప్రముఖ కోచింగ్ సెంటర్లో రెండేళ్ల కోచింగ్ తీసుకున్నారు. మూడు సార్లు సివిల్స్ పరీక్షలలో విఫలమైనా ముక్కవోని ఆత్మవిశ్వాసంతో మళ్లీ ప్రయత్నించి నాల్గొవ సారి 393 ర్యాంక్ సాధించాను. సర్వీసెస్లో ఐఆర్ఎస్ కానీ ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ పోస్టు రావచ్చని అంచనా వేస్తున్నారు.

## మహిళలను గౌరవించడం పురుషుడి బాధ్యత.వీసీ టాటా నర్సింగరావు



**తిరుపతి విద్య మార్చి 6 ప్రభాతవార్త.** సమాజంలో మహిళలను గౌరవించడం, వారిని ప్రోత్సహించడం ప్రతి పురుషుడి బాధ్యతని వీసీ టాటా నర్సింగరావు పేర్కొన్నారు. ఎస్వీయూ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో పని ప్రదేశాలలో మహిళల రక్షణ చట్టం అనే అంశంపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం శుక్రవారం వర్సిటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక సంస్థ ఆరోగ్యకరంగా, పటిష్టంగా ఉండాలంటే మహిళల భాగస్వామ్యం ఎంత కీలకమన్నారు. మహిళలు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే వృత్తిపరమైన సవాళ్లను ధీటుగా ఎదుర్కొంటున్నారని, శాస్త్ర సాంకేతిక రంగాల్లో అనేక ఆవిష్కరణలు చేస్తున్నారని కొనియాడారు. సమాజంలో రక్షణ, భద్రత అనేది మహిళల ప్రాథమిక హక్కు అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ అప్పారావు, ప్రిన్సిపల్ కే సుధారాణి, డైరెక్టర్ ప్రొఫెసర్ సాయి సుజాత, ఆచార్య రమాశ్రీ, ఆర్ మీరా, మహిళా అధ్యయన కేంద్రం అకడమిక్ కన్సల్టెంట్స్ డాక్టర్ రమణ, డాక్టర్‌జగదీశ్వరి,డాక్టర్ రాజ రాజేశ్వరి, వివిధ విభాగాలకు చెందిన విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉద్యమి సభ్యత్వ నమోదు లో జనసేన నాయకులు.



**తిరుపతి విద్య మార్చి 6 ప్రభాతవార్త.** తిరుపతిలో శుక్రవారం 33 వార్డు నందు జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించిన జనసేన నాయకులు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, యువత ఎంతో ఆసక్తిగా పాల్గొని సభ్యత్వాలను నమోదు చేయించుకున్నారు. ఇదే విధంగా తిరుపతిలోని అన్ని వార్డులలో సంబంధించిన ఆ వార్డు అధ్యక్షులు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని ఈ సందర్భంగా నగర అధ్యక్షులు రాజారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో.. నగర అధ్యక్షులు రాజారెడ్డి, క్రికెట్ విజయ్, మధు బాబు, 33వ డివిజన్ కార్పొరేటర్ దూది శివ, 33 వ వార్డు అధ్యక్షుడు బాలాజీ, కొండ రాజమోహన్, దూది రమేష్, శేషాద్రి, శ్రావణ్, జయ బాబు తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## యూజీ పరీక్షల ఫీజు చెల్లింపుకు 21 వరకు గడువు.

**తిరుపతి విద్య మార్చి 6 ప్రభాతవార్త.** ఎస్వీయూ పరిధిలో వచ్చేనెలలో జరగనున్న యూజీ నాల్గొవ, ఆరవ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి పరీక్షల ఫీజును ఈనెల 23వ తేదీలోపు విద్యార్థులు చెల్లించాల్సి ఉంటుందని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ రాజామాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1000ల అపరాధ రుసుముతో ఈనెల 23తో గడువు ముగుస్తుందని తెలియజేశారు.

## విద్యార్థులు అన్నీ రంగాల్లో రాణించాలి : ఎమ్మెల్యే



**కేవీబీ పురం, మార్చి 6 ప్రభాతవార్త:** విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయ బృందం వారిని తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే ఆదిమూలం సూచించారు. శుక్రవారం తిరుపతి జిల్లా కేవీబీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులు అమరావతిలోని ఏపీ అసెంబ్లీ సందర్శనకు వెళ్లారు. ఈ క్రమంలో అక్కడే సమావేశాల్లో పాల్గొంటున్న సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుతో మాట్లాడి విద్యార్థులు శాసన సభ కార్యకలాపాలను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంతో, విద్యార్థులతో కలసి ఆప్యాయంగా ముచ్చటించి, అసెంబ్లీ నిర్వహణ, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ముఖ్యమంత్రి, మంత్రులు, అధికార ప్రతిపక్షపార్టీలకు చెందిన ఎమ్మెల్యేల పాత్ర, చీఫ్ విప్ పనితీరు వంటి అంశాల పట్ల అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే విద్యార్థులకు అవసరమైన భోజనం, వసతులు ఏర్పాట్లకు దగ్గరుండి చూసుకున్నారు.


కెనరా బ్యాంక్ Canara Bank Together we can

తిరుపతి సరోజినిదేవి రోడ్ శాఖ (13171)
తిరుపతి, సెల్: 99851 32041

**బంగారు నగల వేలం ప్రకటన**

ఇందుమూలముగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలకు తెలియజేయడమేమనగా మీరు మా బ్యాంకు వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి పొందిన ఋణమును తిరిగి చెల్లించలేదు. పలుమార్లు నోటీసులు పంపినను బట్వాడా కాకుండా తిరిగి వచ్చినది. **13.03.2026** వ తేది లోపు బకాయిలు,ఇతర ఛార్జీలను చెల్లించి తనఖా వుంచిన సెక్యూరిటీలను తిరిగి పొందగలరు. లేనియెడల బ్యాంకు శాఖ ఆవరణంలో **తేది:16.03.2026 సా.4.00**గం॥లకు లేదా బ్యాంకు నిర్ణయించిన ఏదేని తేదీలలో వేలం వేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు.

| క్ర.నెం. | ఖాతానెం. | ఋణగ్రహీత పేరు & చిరునామా | బంగారు బరువు (గ్రాములలో) | బకాయి మొత్తం ఛార్జీలతో రూ. |
|---|---|---|---|---|
| 1 | 180173649555 | ఎం.రాజేశ్వరి కేరాఫ్ ఎం.పంచ ఆచారి, 4-4-584, నెహ్రూ నగర్, తిరుపతి రూరల్, తిరుపతి - 517501 | 12.500 | 61,758.45 |

తిరుపతి, తేది:06.03.2026 — సం॥ బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంకు

# ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల పై పోరాటం

**- సామాజిక హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి చిన్నం పెంచలయ్య**



వెంకటగిరి, మార్చి 6 ప్రభాతవార్త: రాష్ట్రంలో ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ప్రభుత్వ వైఖరి పై దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన శ్రీకాళహస్తిలో జరిగే జిల్లా స్థాయి సదస్సును జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, సామాజిక హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి చిన్నం పెంచలయ్య పిలుపునిచ్చారు. బోసు బొమ్మ సెంటర్‌లో జిల్లా సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు సామాజిక న్యాయం వెనుకబడిన వర్గాలకు ఉపాధి కల్పన కోసం కూటమి ప్రభుత్వం సంపూర్ణంగా సహకరించడం లేదని ఆయన విమర్శించారు. అణగారిన వర్గాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పలు రాష్ట్రాలు సంఘాలు కోరుతున్నాయి అందులో కర్ణాటక హర్యానా రాష్ట్రాలు స్థానిక అభ్యర్థులకు ప్రవేట్ రంగాలలో ఉద్యోగాల్లో 75 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లులను కూడా తెచ్చాయని తెలిపారు. మన రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు తేవడం లేదని ప్రశ్నించారు. స్వయం ఉపాధి కల్పనకు 40 శాతం నిధులు వినియోగించాలని ఉన్నా రాష్ట్ర ప్రభుత్వాలు చేయకపోవడం దారుణం అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో 9వ తేదీన జరిగే జిల్లాస్థాయి సదస్సుకు దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెవీ ప్రభాకర్, కరువది సుబ్బారావు, ఎస్వీ యూనివర్సిటీ మాజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి సవరయ్య, ప్రొఫెసర్ మురళీధర్, జాతీయ సంస్కృత విద్యాలయం ప్రొఫెసర్ పి వెంకట్రావు, డాక్టర్ మేడికొండ ప్రసాద్ రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి, డిహెచ్పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ నాగరాజు తదితరులు పాల్గొంటున్నారు. ఈ కరపత్రాల విడుదల కార్యక్రమంలో ఎఐటియుసి నియోజకవర్గ నాయకులు కల్లూరు జాన్, రూరల్ మండల కార్యదర్శి ఎస్వి నరసింహులు పట్టణ కార్యదర్శి డక్కిలి శివకుమార్, ప్రసాద్, ఎన్ గురవయ్య, రైతు కూలీ సంఘం నేత రమణయ్య, కృష్ణా రెడ్డి, బిఎస్పి నాయకులు కె సుబ్రమణ్యం, జె పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సంగనపల్లి పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో



డక్కిలి, మార్చి 6 ప్రభాతవార్త: మండలంలోని సంగనపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం మండల విద్యాశాఖాధికారి కిల్లా వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఆయన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయనమాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు. అంతేగాక భోజనం నాణ్యతలో లోపం లేకుండా ఉపాధ్యాయులు పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఇక విద్యార్థులకు క్రమశిక్షణను నేర్పించాలని వివరించారు.

## మండల స్థాయి విజ్ఞాన వారోత్సవాలు



తడ, మార్చి 6 ప్రభాతవార్త : మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు విజ్ఞానవారోత్సవాలు తడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి వేములు ముఖ్యఅతిథిగా నిర్వహించారు విద్యార్థులకు వివిధ పోటీలు పరీక్షలు క్విజ్ నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హరిత, ఉపాధ్యాయులు ప్రకాష్ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## గుంటలు మయంగా పిరిమెడి గ్రామం రోడ్డు



బాలాయపల్లి, మార్చి 6 ప్రభాతవార్త : మండలంలోని పిరిమిడి గ్రామం వెళ్లే రోడ్డు గుంటలు మిట్టలుగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంకటగిరి నాయుడు పేట మార్గం నుండి పిరమిడికి వెళ్లే రోడ్డు గుంటలు పడి ఇబ్బంది పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. రోడ్డు మొత్తం లేచిపోయి వంటలు పడడం వల్ల నడిచి వెళ్లడం కూడా కష్టంగా ఉందని గ్రామస్తులు వాపోయారు. వర్షాకాలంలో ఈ రోడ్డుపై నడవడం కూడా కష్టంగా ఉందని వారు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా రోడ్డు అధ్వానంగా మారిందని చెప్పారు. ఉన్నతాధికారి చర్య తీసుకుని రోడ్డును బాగు చేయించాలని కోరారు.

## మున్సిపల్ కార్మికుల్ని పర్మినెంట్ చేయాలి



వెంకటగిరి, మార్చి 6 ప్రభాతవార్త: మున్సిపల్ వర్కర్స్ అని వెంటనే పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డీపల్లి చంగయ్య తెలిపారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద పర్మినెంట్ చేయాలని వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ మహిళా కార్మికులు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ దీక్షల్ని ఉద్దేశించి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డీపల్లి చెంగయ్య, సిఐటియు నెల్లూరు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ, ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి వరకు కష్టపడేది మున్సిపల్ కార్మికులని అన్నారు. మార్చి 7న పురుష మున్సిపల్ కార్మికులతో దీక్షలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ సిఐటియు మహిళా నాయకులు ఇందరమ్మ, శుభ రత్నమ్మ, శిరీష, మాధురి, కృష్ణమ్మ, లక్ష్మి, రత్నమ్మ, బుజ్జమ్మ, రావమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మృతికి సంతాపం తెలిపిన రామ్‌కుమార్ రెడ్డి



వెంకటగిరి, మార్చి 6 ప్రభాతవార్త: మాజీ ఎంపీపీ సత్యనారాయణ జెట్టి సతీమణి, మున్సిపాలిటీ లీగల్ అడ్వైజర్, ప్రముఖ న్యాయవాది పూనమల్లి జయప్రకాష్ జెట్టి తల్లి పూనమల్లి వసుంధర రాణి మృతి చెందడంతో పార్థివ దేహానికి పూలమాలు వేసి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుపల్లి రాంకుమార్‌రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన వెంట వైసీపీ నాయకులు ప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి తదితరులు ఉన్నారు.

## గవర్నర్ జస్టీస్ నజీర్‌కు... సాదర స్వాగతం



తిరుపతి, మార్చి 6ప్రభాతవార్త: రెండురోజుల తిరుపతి పర్యటనకు శుక్రవారం ఉదయం తిరుపతికి చేరుకున్న రాష్ట్ర గవర్నర్ జస్టీస్ అబ్దుల్ నజీర్ దంపతులకు సాదర స్వాగతం లభించింది. తిరుపతిలో నేడు జరగనున్న పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం 22వ స్నాతకోత్సవంలో ఛాన్సెలర్ హోదాలో పాల్గొని పట్టాలను ప్రదానం చేయనున్నారు. ఇందుకు తిరుపతికి చేరుకున్న గవర్నర్‌కు తిరుపతి జిల్లా ఎస్పీ లంకెలసుబ్బరాయుడు, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఉమ వెన్నం, రిజిస్ట్రార్ ఆచార్య ఉష పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

## తిరుమలలో కమర్షియల్ గ్యాస్ సిలెండర్ల కొరత!




తిరుపతిరూరల్, మార్చి6 ప్రభాతవార్త: తిరుపతి నగరములో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాలో కొరత ఏర్పడిందని కొంతమంది హోటల్ వ్యాపారులు, వినియోగదారుల నుంచి సమాచారం వినిపిస్తోంది. గత కొద్దిరోజులుగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్స్ సమాయానికి అందకపోవడంతో హోటల్స్, చిన్న వ్యాపార సంస్థలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వారు చెబుతున్నారు. సరఫరా ఆలస్యం కావడంతో వ్యాపార కార్యకలాపాలపై ప్రభావం పడుతున్నట్లు వినియోగదారులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సివిల్ సప్లై అధికారులను సంప్రదించగా తిరుపతిలో కమర్షియల్ గ్యాస్ కొరత ఉన్నట్లు తమ దృష్టికి అధికారికంగా ఎలాంటి ఫిర్యాదులు రాలేదని అధికారులు తెలిపారు. ముఖ్యంగా తిరుమలలో మాత్రమే కమర్షియల్ గ్యాస్ డిమాండ్ పెరిగినట్లు సమాచారం వచ్చిందని పేర్కొన్నారు. సివిల్ సప్లైశాఖ ఏఎస్ఓ గంగయ్య మాట్లాడుతూ తిరుమల ప్రాంతంలో దాదాపు 100కు పైగా కమర్షియల్ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, యాత్రికుల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల అక్కడ డిమాండ్ పెరుగుతుందని తెలిపారు. అయితే తిరుపతి నగరంలో కమర్షియల్ గ్యాస్ సరఫరా సాధారణంగానే కొనసాగుతుందని, కొరత ఉన్నట్లు తమకు సమాచారం లేవన్నారు. ఏదైనా ప్రాంతాల్లో సరఫరా సమస్యలు ఉన్నట్లయితే సంబంధిత గ్యాస్ ఏజెన్సీలు, అధికారులకు తెలియజేసే వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. వినియోగదారులు అందోళన చెందాల్సిన అవసరం లేదని కూడా తెలిపారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో సరఫరా ఆలస్యంపై వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తుండటంతో పరిస్థితిని అధికారులు సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆక్రమిత రైల్వే స్థలాలు ఖాళీ చేయాలని నోటీసులు



పుత్తూరు రూరల్, మార్చి 6 ప్రభాతవార్త: పుత్తూరు రైల్వేస్టేషన్ విస్తరణ పనుల నేపథ్యంలో రైల్వే స్థలాల్లో ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలో రైల్వే భూమిలో నివసిస్తున్న 10 మందికి అధికారులు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ ఎస్.ఎస్.శ్రీనివాసులు మాట్లాడుతూ గేట్‌పుత్తూరులోని దర్గా వద్ద వంపు తిరిగిన రైల్వే మార్గాన్ని నేరుగా సరి చేయడానికి యార్డ్ మోడలింగ్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. తమిళ పాఠశాల కూడలి నుంచి ఉత్తర దిశగా వెళ్లే మేదర వీధిలోని సినిమా థియేటర్ వరకు ఉన్న ఆక్రమణలను తొలగించనున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో మేధర వీధి పడమర వైపున ఉన్న ఇళ్లు, వీధిలో సుమారు 80 శాతం భాగం, అలాగే పడమర వైపున ఉన్న మాంసం దుకాణాలను కూడా తొలగించాల్సి వస్తుందని తెలిపారు. అలాగే వెంకటేశ్వర ఆస్పత్రి వైపు వెళ్లే అండర్ బ్రిడ్జి వరకు ఉన్న తాత్కాలిక రహదారిని కూడా మూసివేస్తామని తెలిపారు. లేకపోతే మరో 20 రోజుల్లో రైల్వేశాఖే వాటిని తొలగిస్తుందని హెచ్చరించారు. పీడబ్ల్యుఐ అధికారి బాలాజీ, ఆర్‌పీఎఫ్, ఏఎస్ఐ కార్తీకేయలు పాల్గొన్నారు.

## చెరుకు రైతుల బకాయిలు వెంటనే చెల్లించాలి

నిండ్ర, మార్చి 6 ప్రభాతవార్త : నేతమ్స్ షుగర్ ప్యాక్టరీ చెరుకు రైతుల బకాయిలు వెంటనే చెల్లించాలని నేతాజీ సంఘం అధ్యక్షులు ఆదినారాయణరెడ్డి డిమాండ్ చేసారు. శుక్రవారం మండలంలోని నేతమ్స్ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో చెరుకు బకాయిలు చెల్లించాలని రైతులు, నాయకులు సమావేశం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చెరుకు రైతలకుచెల్లించవలసిన 36కోట్లు బకాయిలు చెల్లించాలని ప్యాక్టరీ యాజమాన్యంకు, ప్రభుత్వాలకు విన్నవించిన ఆరు సంవత్సరాలుగా డిమాండ్ చేసిన ఏలాంటి ఫలితం లేదని విమర్శించినారు. 2024 వసంవత్సరం ఎన్నికల సమయంలో ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రైతులకు చెల్లించవలసిన బకాయిలు టిడిపి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే రైతుల బకాయిలు చెల్లిస్తానని చెప్పిన హామి అమలు చేయలేదని అన్నారు. రైతులకు చెల్లించవలపిన బకాయిలు మార్చి 16వతేది లోపు చెల్లించని పక్షంలో రైతులు అందోళన చేస్తామనిఅన్నారు. కార్యక్రమంలో సంయిక్త కార్యదర్శి దాసరి జనార్దన్, రైతులు అనంతశయనం, గుణశేఖర్, బాలయ్య, షణ్ముగం, క్రిష్ణయ్య, చంద్రశేఖర్, మురళీ, గంగాధరం తదితరులు పాల్గోన్నారు.

## వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా శేఖర్‌రెడ్డి



తిరుపతిరూరల్, మార్చి6 ప్రభాతవార్త: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా భాగ్యనగరం శేఖర్‌రెడ్డి (ఎస్.డి.శేఖర్‌రెడ్డి)ని నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైయస్.జగన్మోహన్‌రెడ్డి అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ పట్ల ఆయన చూపుతున్న నిబద్ధత, ప్రజా సమస్యలపై చురుకైన స్పందన కార్యకర్తలతో సమన్వయం వంటి అంశాలను గుర్తించి ఈ పదవిని అప్పగించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. భాగ్యనగరం శేఖర్‌రెడ్డి ఎన్నాళ్లుగానో పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకుడిగా గుర్తింపు పొందారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కార్యకర్తలతో సమన్వయం చేస్తూ పార్టీ కార్యక్రమాలను విజయవంతం నిర్వహించడంలో ఆయన కీలకపాత్ర పోషించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఇదిలా వుండగా ఆయన కుటుంబం కూడా ప్రజాసేవలో ముందంజలో ఉంది. ప్రస్తుతం శేఖర్‌రెడ్డి భార్య రాయల్‌నగర్ కార్పొరేటర్‌గా ప్రజలకు సేవలందిస్తూ...స్థానిక సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరిస్తున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు శేఖర్‌రెడ్డిని అభినందిస్తూ ఆయన కొత్త బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## తొట్టంబేడు మండలంలో లోవోల్టెజి సమస్యకు చెక్

**-రూ.5కోట్లతో ట్రాన్స్‌ఫార్మర్స్**

తొట్టంబేడు, మార్చి 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలంలో ఎంతో కాలంగా రైతులు, ప్రజలు గ్రామాల్లో ఎదుర్కొంటున్న విద్యుత్ లో వోల్టేజి సమస్యకు శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి చొరవతో చెక్ పడిందని మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలాన్ని అన్ని రంగాల్లో సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుటకు ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటున్నారని అన్ని శాఖల ఉన్నతాధికారులతో కలసి నిధులు సాధిస్తున్నారని మునిరాజానాయుడు వివరించారు. కాసరం వద్ద సబ్‌స్టేషన్‌లో ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. దాంతో కాసరం పరిసరాల్లోని 20 గ్రామాలలో విద్యుత్ సమస్య పరిష్కారం అవుతుందని ఆయన వివరించారు.

## జయహో భారత్

**-ప్రపంచకప్ క్రికెట్ పోటీల్లో విజయకేతనం**



తిరుపతి, మార్చి 6ప్రభాతవార్త: టి20 ప్రపంచ కప్ సెమీఫైనల్ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించడంతో తిరుపతిలో బిజెపి నాయకులు, క్రికెట్ అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. సెమీఫైనల్ ఆటలో మొదట బ్యాటింగ్ చేసిన భారత జట్టు ఇంగ్లాండ్ బౌలర్లపై ఆధిపత్యం చెలాయిస్తూ 253 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. భారత్ విజయాన్ని పురస్కరించుకుని తిరుపతిలో బిజెపి సీనియర్ నాయకుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో లోక ప్రభాకర్ నాయుడు, పాటి బండ మురళి, జయంత్ కుమార్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, ఏవన్ మస్తాన్, తెలుగుదేశం నాయకులు చిత్రపు హనుమంతరావు, సింగంశెట్టి సుబ్బరామయ్య, కళాకారులు కేశవరెడ్డి, జయరామ్ యాదవ్, చంద్రబాబు నాయుడు, సురేష్ క్రికెట్ అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అయ్యల నాడు చెరువుపై కబ్జాదారుల కన్ను

**-సిపిఎం ఆఫీస్ వెనుక ఎవరు చదును చేసారబ్బా!**



శ్రీకాళహస్తి, మార్చి 6 ప్రభాతవార్త: మళ్ళీ శ్రీకాళహస్తి పట్టణంలోని నడి బొడ్డులో ఉన్న అయ్యలనాడు చెరువు మీద మళ్ళీ కబ్జాదారుల కన్ను పడినట్లు తెలిసింది. రాత్రికి చదును చేసే కార్యక్రమాలను మూడో కంటికి తెలియకుండా చేస్తున్నారనే విమర్శలు వినబడుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి సిపిఎం కార్యాలయం వెనుక ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు యంత్ర సహాయంతో చదును చేసారు. అయితే ఇది ఎవరి పనులు అనేది అంతుపట్టడం లేదు. పలు కార్యాలయాలకు స్థలాలు కేటాయించిన తరువాత అప్పటి శాసనసభ్యుడు, మంత్రి హోదాలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి లోతట్టు భాగాన్ని బోట్ క్లబ్ ఏర్పాటు చేయాలని ఆలోచించారు. ఈ మేరకు ప్రతి పాదించి 'అమృత పథకంలో' రూ.75 లక్షలు నిధులు కేటాయించారు. అయితే అప్పటి కమిషనర్ రమేష్‌బాబు ఈ నిధులు చెరువులో ఉన్న నీరు బెయిల్ అవుట్ చేయటానికి సరిపోదని పనులు చేపట్టలేదు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతుంది. శ్రీకాళహస్తికి రెగ్యూలర్ తహశీల్దార్ లేదు తొట్టంబేడుకు ఉన్నా నాకేం తెలియదు, నాకేం ఫిర్యాదులు అందలేదనే రీతిలో వ్యవహరిస్తున్నారు.

## అగ్నికి ఆహుతైన మామిడి, నేరేడు చెట్లు!

**- సాయం అందించాలని కోరుతున్న రైతులు**



పాకాల, మార్చి 6 ప్రభాతవార్త: గుర్తు తెలియని వ్యక్తులు అగ్గి పెట్టడంతో పాకాల మండలం గాదంకి గ్రామంలోని ఓ రైతుకు చెందిన సుమారు నాలుగు ఎకరాల్లోని మామిడి చెట్లు, నేరేడు చెట్లతో పాటు బోరు మోటారు కాలిపోయిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. పాకాల మండలం గాదంకి గ్రామానికి చెందిన రైతులు రెడ్డెప్ప, రెడ్డెమ్మలు సుమారు ఐదు ఎకరాల్లో 30 యేండ్ల వయిస్సు కలిగిన మామిడి చెట్లు, మూడు సంవత్సరాల నేరేడు, జామ, ఉసిరి చెట్లు సాగు చేస్తున్నారు. అయితే గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అగ్గి పెట్టడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. రాత్రి సమయం కావడంతో ఎవరూ గుర్తించక పోవడంతో మొత్తం అగ్నికి ఆహుతి అయ్యింది. దీంతో మామిడి, నేరేడు, ఉసిరి, జామ, టేకు, ఎర్ర చందనం చెట్లతో పాటు బోరు మోటారు కాళిపోయాయి. దీంతో రైతులు లేబోదిబో మంటున్నారు. గాదంకి విఆర్‌వోకు సమాచారం అందిచడంతో ఆయన అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారని తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి రైతులను ఆదికోవాలని ఈ సందర్భంగా కోరుతున్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## త్వరితగతిన విద్యుత్ సమస్యలు పరిష్కారం



బాలాయపల్లి, మార్చి 6 ప్రభాతవార్త: వినియోగదారులు చెప్పిన సమస్యలను పరిష్కరిస్తామని ఏ ఈ ఏడుకొండలు తెలిపారు. మండలం పాకపూడి గ్రామంలో విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ తమ విద్యుత్ సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగి విద్యుత్ వినియోగదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏఈ విద్యుత్ సరఫరాలో అంతరాయం, విద్యుత్ కనెక్షన్ సమస్యలు, బిల్లుల వివాదాలు, విద్యుత్ భద్రత, ప్రమాదాల నివారణ, డిజిటల్ చెల్లింపులు వంటి అంశాలపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పిస్తూ, వారి సమస్యలు తెలుసుకున్నారు. పొలాల వద్ద స్టార్టర్లు, ఎర్తింగ్ భద్రతకు తగిన జాగ్రత్తలు పాటించాలని రైతులకు సూచించారు. గ్రామంలో కిందకు వేలాడే విద్యుత్ తీగలను సరి చేశారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ చెల్లయ్య, లైన్ మాన్ రవికుమార్, బాలసుబ్రమణ్యం, ఏఎల్ఎం సుధీర్, మహమ్మద్ ఆలీ, జేఎల్ఎంలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## కాణిపాకంలో ఘనంగా సంకటహార గణపతివ్రతం





కాణిపాకం, మార్చి 6 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శుక్రవారం సంకటహర గణపతివ్రతంను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం చతుర్థి రోజున ఈవ్రతంను నిర్వహిస్తుంటారు. ఈమేరకు దేవస్థానం ఆస్థాన మండపంలో శుక్రవారం చతుర్థి వ్రతంను ఉదయం, సాయంత్రం వేళల్లో మూడు దఫాలుగా అర్చకులు నిర్వహించారు. ఈమేరకు ఉదయం 9, 11 గంటలకు, సాయంత్రం 5 గంటలకు వ్రతాన్ని మూడు దఫాలుగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం ప్రధాన ఆలయం నుండి అలంకరించిన సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ స్థానిక ఆస్థాన మండపంకు తీసుకువచ్చి వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ వేదపండితులు సంకష్ట చతుర్థి వ్రతం మహత్యాన్ని గురి ంచి వివరించారు. ఈవ్రతంను ఆచరించడం వల్ల భక్తులకు ఈతిబాధలు, కష్టాలు తొలగి అనుకున్న కోరికలు నెరవేరి అంతా శుభం కలుగుతుందని పురాణాలు స్పష్టం చేస్తున్నాయని వేదపండితులు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పెంచల కిషోర్ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ అర్చకులు వేదపండితులు, టెంపుల్ ఇన్స్పెక్టర్లు బాలాజీనాయుడు, రవి, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడి పాఠశాల భవనం ప్రారంభం



ఏర్పేడు, మార్చి 6 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం కాట్రకాయల గుంటలో శుక్రవారం అంగన్‌వాడి పాఠశాలను ప్రారంభించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రస్తుత శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఆయనసతీమణి రిషితారెడ్డిలు వెళ్ళినపుడు గ్రామానికి చెందిన వారు అంగన్‌వాడికి భవనం లేదని వారి దృష్టికి తెచ్చారు. ఈ మేరకు గెలిచిన తరువాత ఇక్కడ అంగన్‌వాడి భవనాన్ని నిర్మించారు. శుక్రవారం ఆ భవనాన్ని రిషితారెడ్డి ప్రారంభించారు. ఈ భవనాన్ని కోకా కోలా మేనేజ్‌మెంట్ సిఎస్ఆర్ నిధులతో నిర్మించారు. ఈ కార్యక్రమాల్లో ఏర్పేడు మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజనాయుడు, మాజీ అధ్యక్షుడు పొన్నారావు, ఏర్పేడు ప్రాథమిక సహకార సంఘ చైర్మెన్ మహేష్‌రెడ్డి, షేఖ ఖలీల్‌బాషా, నితీష్, కృష్ణవేణి, రత్నమ్మ, గాలి కృష్ణవేణి, రాఘవేంద్ర, సురేష్, చంద్రశేఖర్ నాయుడు, రాజా, గునాయాదవ్ కె.కె రమణ, రాచాటి సుబ్రమణ్యం, మునిరెడ్డి, కేశినేని సుబ్రమణ్యం, నారాయణ, రామదాసు, బి.కృష్ణయ్య, చంద్ర, శ్రీపతి, వెంకటరమణ, బాలకృష్ణారెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, నాగంపల్లి సుబ్రమణ్యం రెడ్డి, చంద్ర, హరి, వై మనోహర్‌నాయుడు అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## 102 మందికి బంగారు పతకాలు... 2,591మందికి డాక్టరేట్‌లు

**-నేడు పద్మావతి వర్సిటీ స్నాతకోత్సవం**



యూనివర్సిటీ(తిరుపతి), మార్చి 6ప్రభాతవార్త: పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం 22వ స్నాతకోత్సవం శనివారం ఉదయం జరగనుంది. ఈ కార్యక్రమంలో 2,591మందికి డాక్టరేట్ ప్రదానం చేయనుండగా 102మంది అభ్యర్థులకు బంగారుపతకాలు ప్రదానం చేయనున్నారు. 22వ స్నాతకోత్సవం వివరాలను శుక్రవారం ఉదయం వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమ వెన్నం, రిజిస్ట్రార్ ఆచార్య ఉష, డీన్ ఆచార్య అనురాధ, పిఆర్ఓ డాక్టర్ శ్రీరజనీతో కలసి మీడియాకు వెల్లడించారు. డిఆర్‌డిఓ హైదరాబాద్ శాస్త్రవేత్త శశికళ సిన్హాకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జస్టీస్ అబ్దుల్‌నజీర్ ఛాన్సెలర్ హోదాలో హాజరవుతున్నారు. స్నాతకోత్సవంలో 2,591మందికి పిహెచ్‌డి పట్టాలు, ఎంఫిల్, పోస్టుగ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్, దూరవిద్యావిభాగంలో పట్టాలు ప్రదానం చేయనున్నారు. 102మందికి సైన్సెస్, సోషల్‌సైన్సెస్, ఇంజనీరింగ్ టెక్నాలజీ విభాగాల్లో బంగారు పతకాలు ప్రదానం చేస్తారు. 23మందికి బుక్‌ప్రైజ్‌లు, 7మందికి నగదు అవార్డులు అందజేయనున్నారు.

## కోర్టుకు హాజరైన హర్ష వీణ!




రైల్వే కోడూరు, మార్చి 6 ప్రభాతవార్త : రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బాధితురాలు హర్షవీణ శుక్రవారం రైల్వే కోడూరు సివిల్ జూనియర్ కోర్టు జడ్జి ముందుకు తన లాయర్ తో హాజరయ్యారు. ఈ సందర్భంగా హర్షవీణ న్యాయవాది సాయి కృష్ణ ఆజాద్ మాట్లాడుతూ హర్షవీణకు సంబంధించిన కేసు కోర్టు పరిధిలో ఉన్నందున ఆమె ఎటువంటి మాట్లాడకూడదు అని హైకోర్టు ఆదేశాల మేరకు రైల్వే కోడూరు కోర్టులో జమీందారులను మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచామన్నారు. రేపటి నుంచి హర్షవీణ సాధారణ కార్యకలాపాలకు వెళుతుందని అదే విధంగా శనివారం రాజంపేటకు నేషనల్ ఎస్సీ ఎస్టీ కమిషన్ వస్తున్నారని అందులో హర్షవీణ మరియు తాను పాల్గొంటామన్నారు. గతంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తల్లి పెట్టిన కేసులో బెయిల్ వచ్చిందని, గతంలో హర్ష వీణ పాత్రికేయులతో మాట్లాడేటప్పుడు కొన్ని తప్పులు దొర్లాయని ఆమెకు అవగాహన లేక మాట్లాడిందని, వాటిని సరి చేసుకుంటున్నామన్నారు. 25 కోట్లకు సంబంధించి హర్షవీణ ఎవరిని ఫోర్స్ చేయలేదని న్యాయవాది సాయి కృష్ణ ఆజాద్ విలేకరులకు వివరించారు.


**కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ), కుప్పం**

**డ్రైవర్లు కావలెను**

కుప్పం నియోజకవర్గంలో CNG కాంపాక్టర్ వాహనాలు నడవడానికి డ్రైవర్లు కావలెను.
కావాల్సిన డ్రైవర్లు సంఖ్య : 2- అర్హత : హెవీ డ్రైవింగ్ లైసెన్సు,
రోజుకు 12 గంటలు విధులు నిర్వహించగలగాలి.
ఆసక్తిగల అభ్యర్థులు కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) కార్యాలయాన్ని సంప్రదించగలరు.
mail: projectdirectorkada@gmail.com, Phone No: 8639130749